**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం



PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 29, పేజీలు - 08

శనివారం, జులై 25, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







# ఓఆర్ఆర్ లోపలే ఇందిరమ్మ ఇండ్లు

## - సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ క్యూర్ పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇండ్లు జనావాసాల పరిధిలోనే ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల వివిధ శాఖలకు సంబంధించి నిరుపయోగంగా ఉన్న స్థలాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు.క్యూర్ అర్బన్ ఏరియాలో ఇందిరమ్మ ఇండ్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లతోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. పలు నియోజకవర్గాల్లో ఇప్పటికే గుర్తించిన స్థలాల గురించి అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వివరించారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖలకు సంబంధించి గుర్తించిన నిరుపయోగ స్థలాలను తీసుకుని, ప్రత్యామ్నాయంగా సంబంధిత శాఖలకు వేరేచోట స్థలాన్ని కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

**జనావాసాలకు దగ్గరగా ఇందిరమ్మ ఇండ్లు**

జనావాసాలకు దూరంగా ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరుపయోగంగా మారే అవకాశం

2లో..

### రెండు డిమాండ్లకు

# ప్రభుత్వం సిద్ధం!

## - ధర్మేంద్ర రాజీనామా వీడని చిక్కుముడి!

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు పట్టు వీడని సీజేపీ
- నేడు మధ్యాహ్నం వరకు గడువు కోరిన కేంద్ర ప్రభుత్వం
- పరిహారం, విద్యార్థులపై కేసులు ఎత్తివేయడానికి సూత్రప్రాయ అంగీకారం
- డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళనలు కొనసాగుతాయని సీజేపీ స్పష్టీకరణ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని కేంద్రంతో రెండో విడత చర్చల్లో కాక్రోచ్ జనతా పార్టీ స్పష్టం చేసింది. అంతవరకు తమ ఆందోళన కొనసాగుతుందని పునరుద్ఘాటించింది. విద్యాశాఖ మంత్రి రాజీనామా తప్ప మరో చర్చకు తావులేదని పేర్కొంది. శుక్రవారం కానిస్టిట్యూషన్ క్లబ్‌లో కేంద్ర మంతులతో జరిగిన చర్చల్లో స్పష్టం చేసింది. ఈ చర్చల్లో కేంద్ర ప్రభుత్వం తరఫున మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ సీజేపీ ప్రతినిధులుగా సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా పాల్గొన్నారు.

2లో..

### జెన్-జీ పవర్‌ను

# తక్కువ అంచనా వేయకండి

## - నేపాల్,శ్రీలంకల్లా జరగొచ్చని మోదీకి కేటీఆర్ ఘాటు హెచ్చరిక!




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** దేశవ్యాప్తంగా విద్యావ్యవస్థను పట్టిపీడిస్తున్న పేపర్ లీకేజీలు, నిరుద్యోగ సమస్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ నేటి యువత, జెన్-జీ' తరం పవర్‌ను అంచనా వేయడంలో తీవ్రంగా పొరపడుతున్నారని ఆయన మండిపడ్డారు. నీట్ లీకేజీకి వ్యతిరేకంగా విద్యా మంత్రి రాజీనామా చేయాలన్న డిమాండ్ తో ఇందిరాపార్క్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఇందులో పాల్గొన్న విద్యార్థులను ఉద్దేశించి కేటీఆర్ ప్రసంగించారు. దేశ యువత స్వరం మారుతోందని, కొత్త ఆలోచనలతో కూడిన ఈ తరం రాజకీయాలను పునర్నిర్మిస్తోందని స్పష్టం చేశారు. నేపాల్, శ్రీలంకల్లో ఇటీవల చోటుచేసుకున్న ప్రజా తిరుగుబాట్లను

2లో..

### ప్రభుత్వ స్కూళ్ల బ్రేక్‌ఫాస్ట్ స్కీంకు విరాళాల వెల్లువ

**- అరబిందో, దివీస్.. ఏకంగా రూ.22.18 కోట్ల చేయూత**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో అమలు అవుతున్న బ్రేక్‌ఫాస్ట్ పథకానికి కార్పొరేట్ సంస్థల నుంచి విశేషంగా చేయూత అందుతోంది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమంలో

2లో..

# చదువే పిల్లలకు శాశ్వత ఆస్తి



**తల్లిదండ్రులు-టీచర్లు కలిస్తేనే విద్యార్థుల విజయం**

- రంపచోడవరం మెగా పీటీఎంలో సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు
- పిల్లలకు చదువును మించిన గొప్ప ఆస్తి మరొకటి లేదని స్పష్టీకరణ
- ప్రభుత్వ బడులపై నమ్మకంతో లక్షా పది వేల మంది చేరారని వెల్లడి
- ఆగస్టు 1న ప్రధాని మోదీ చేతుల మీదుగా భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభం

అమరావతి (ప్రశ్న న్యూస్) విద్యాసంస్కరణలే రాష్ట్ర భవిష్యత్తుకు అసలైన పునాదులని, తాను నిన్నటి ఆలోచనను కాదని రాష్ట్రాన్ని నిలబెట్టే భవిష్యత్తు విజన్‌ను అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరంలో శుక్రవారం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మెగా పేరెంట్-టీచర్ మీట్ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. గిరిజన ప్రాంతమైన రంపచోడవరంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడిన చంద్రబాబు, విద్యావ్యవస్థలో తాము తీసుకొచ్చిన మార్పులు , రాష్ట్ర భవిష్యత్తు

2లో..

# జనసేన పార్టీలో కమిటీల నియామకం

## - దరఖాస్తులు స్వయంగా పరిశీలిస్తున్న పవన్ కల్యాణ్



అమరావతి (ప్రశ్న న్యూస్) జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కమిటీలను నియమించడంపై ఆ పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టి సారించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా పార్టీలో వివిధ స్థాయిల్లో నాయకత్వ బాధ్యతలు చేపట్టేందుకు ఆసక్తి వ్యక్తం చేసిన జనసేన శ్రేణుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా 25 పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో వివిధ స్థాయిల్లో పార్టీ నాయకత్వ బాధ్యతలు చేపట్టేందుకు ఆసక్తి వ్యక్తం చేస్తూ జనసేన నాయకులు, కార్యకర్తలు 36 వేలకు పైగా దరఖాస్తులు సమర్పించారు. ఈ దరఖాస్తులను జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్వయంగా పరిశీలిస్తున్నారు. ఈ మేరకు జనసేన పార్టీ ఒక ప్రకటన విడుదల చేసింది.జనసేన శ్రేణులు సమర్పించిన 36 వేలకు పైగా దరఖాస్తులను పవన్ కల్యాణ్ దశలవారీగా పరిశీలన చేపట్టి, పార్టీ కమిటీలను ఖరారు చేయనున్నారు. ఇటీవల కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ కల్యాణ్, స్వల్ప విశ్రాంతి అనంతరం పార్టీ, ప్రభుత్వ

2లో..

### విద్యార్థుల ముసుగులో

# అరాచక శక్తులు

## - పార్లమెంటుపై దాడికి కుట్ర అన్న బండి సంజయ్

- విద్యార్థుల భవిష్యత్తు కోసం కేంద్రం అహర్నిశలు కృషి చేస్తోందన్న బండి
- నీట్ ఘటనపై మోదీ తీవ్రంగా కలత చెందారని వ్యాఖ్య
- ధర్మేంద్ర ప్రధాన్ క్షమాపణ చెప్పారన్న బండి సంజయ్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** నీట్ పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, వారి కుటుంబాలను తీవ్ర ఆందోళనకు గురి చేసిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా స్పందించిందని విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతినకుండా వేగంగా చర్యలు చేపట్టిందని తెలిపారు. నిందితులపై ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ కొనసాగుతోందని సీబీఐ

2లో..

# పేపర్ లీకేజీ చట్టం కఠినతరం!

## - 10 ఏళ్ల జైలు, 10 కోట్ల జరిమానా!



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న పరీక్ష పత్రాల లీకేజీల నివారణకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంటోంది. పబ్లిక్ పరీక్షల (అక్రమ మార్గాల నివారణ) చట్టం-2024కు సవరణలు చేస్తూ, దోషులకు మరింత కఠిన శిక్షలు విధించే ప్రతిపాదనలకు కేంద్ర కేబినెట్ శుక్రవారం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ నూతన సవరణల ప్రకారం, ప్రశ్నాపత్రాల లీకేజీలకు పాల్పడే వారికి గరిష్ఠంగా పదేళ్ల జైలు శిక్షతో పాటు, రూ.10 కోట్ల వరకు భారీ జరిమానా విధించే అవకాశం ఉంది. ప్రస్తుతం అమలులో ఉన్న చట్టం ప్రకారం వ్యక్తిగత అక్రమాలకు మూడు నుంచి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధిస్తున్నారు. వ్యవస్థీకృత నేరాలకు ఇప్పటికే కఠిన శిక్షలు ఉన్నప్పటికీ,

2లో..

### కోర్టు దృశ్యాలను ప్రసారం చేయడంపై

# సుప్రీంకోర్టు ఆగ్రహం

## - అనుమతి లేకుండా వీడియోలను అప్‌లోడ్ చేయడంపై నిషేధం



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** కోర్టు విచారణలకు సంబంధించిన ఆడియో, వీడియో రికార్డింగ్‌లను సోషల్ మీడియాలో విచ్చలవిడిగా, అసంపూర్తిగా ప్రసారం చేయడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. కోర్టు కార్యకలాపాల వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడాన్ని సీసాలో నుంచి బయటకు వచ్చిన భూతంతో పోల్చిన ధర్మాసనం,

2లో..

# హిమాచల్‌లో విషాదం..

## కొండచరియలు విరిగిపడి 13 మంది మృతి

- లాహౌల్-స్పితి జిల్లాలో ఘోర ప్రమాదం
- ప్రయాణిస్తున్న ట్యాక్సీపై విరిగిపడిన కొండచరియలు
- ఘటనలో 13 మంది అక్కడికక్కడే మృతి, ఇద్దరికి గాయాలు

2లో..



# నీట్ లీక్‌పై కేంద్రం ఉక్కుపాదం

## - నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలో బిగ్ రీసెట్

## - 47 మంది అధికారులకు కేంద్రం ఉద్వాసన

NATIONAL TESTING AGENCY
Excellence in Assessment

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన నీట్ ప్రవేశ పరీక్ష పత్రాల లీకేజీ వివాదంపై కేంద్ర ప్రభుత్వం అత్యంత కఠినమైన నిర్ణయాలు తీసుకుంటోంది. జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్షలను నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు కేంద్ర విద్యాశాఖ బిగ్ రీసెట్ ప్రణాళికను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఏజెన్సీలోని దాదాపు 47 మంది అధికారులను తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఎన్టీఏ చరిత్రలోనే ఇది అతిపెద్ద పరిపాలనాపరమైన ప్రక్షాళనగా నిలవనుంది. ఈ చర్యలతో పాటు లీకేజీలకు మూలకారణంగా మారిన ఔట్‌సోర్సింగ్ పద్ధతులకు స్వస్తి పలకాలని ,వాటిలో మూలమట్టమైన మార్పులు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటివరకు ప్రశ్నాపత్రాల తయారీ, పంపిణీ, పరీక్షా కేంద్రాల నిర్వహణ, డేటా ప్రాసెసింగ్‌లో ప్రైవేట్ ఏజెన్సీలపై ఆధారపడటమే భద్రతా లోపాలకు దారితీసిందని గుర్తించారు. ఇకపై ప్రభుత్వ పరిధిలోని సాంకేతిక వ్యవస్థలు, అంతర్గత నిపుణుల ద్వారానే పరీక్షల ప్రక్రియను నిర్వహించేలా నూతన నిబంధనలను రూపొందిస్తున్నారు.కేవలం అధికారుల బదిలీలు, తొలగింపులకే పరిమితం కాకుండా, లీకేజీలకు లేదా నిర్లక్ష్యానికి కారణమైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా

2లో..

## ఓఆర్ఆర్ లోపలే ఇందిరమ్మ ఇండ్లు

ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. పని ప్రదేశాలకు దగ్గరగా, జనావాసాల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేలా చూడాలని ఆదేశించారు. దీని వల్ల నిరుపేదలు జీవనోపాధి కోల్పోకుండా ఉంటారని చెప్పుకొచ్చారు. క్యూర్ ఏరియాలో పలు నియోజకవర్గాల్లో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఒక్కో ఫ్లాట్ దాదాపు 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో నిర్మించనున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి దాదాపు రూ. 11 లక్షలు ఖర్చువుతుండగా, ప్రభుత్వం ఇందులో రూ. 5 లక్షల మేరకు సబ్సిడీని అందిస్తోంది. మిగిలిన రూ. 6 లక్షలు లబ్ధిదారుడి వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. భూమికయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరిస్తోంది.

### తొలి దశలో 17 నియోజకవర్గాలలో 7680 ప్లాట్లు

ఇకపోతే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించి తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7 వేల 680 ఫ్లాట్లు నిర్మించి ఇచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజ్‌గిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, బహదూర్‌పురా, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్‌నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించనుంది. ఈ నియోజకవర్గాల పరిధిలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## రెండు డిమాండ్లకు ప్రభుత్వం సిద్ధం!

తమ డిమాండ్లపై నేడు మధ్యాహ్నం వరకు సమయం కావాలని కేంద్రం కోరిందని సీజేపీ ప్రతినిధులు పేర్కొన్నారు. అటు కేంద్ర మంత్రి జేపీ నడ్డా మాట్లాడుతూ..“ఈ సమావేశం దాదాపు 2 గంటల పాటు కొనసాగింది. పరీక్షలకు సంబంధించి వారు 3 ప్రధాన డిమాండ్లు, 5 సంస్కరణల సూచనలు ఇచ్చారు. మేము జరిపిన చర్చలు, డిమాండ్లపై నిర్ణక్షం తెలియజేయడానికి రేపు మధ్యాహ్నం వరకు గడువు కోరాం” అని అన్నారు.మూడు డిమాండ్లలో రెండింటికి ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని, అయితే ప్రధాన్ రాజీనామా డిమాండ్‌పై మరింత సమయం కోరిందని అశుతోష్ రాంకా తెలిపారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే మా డిమాండ్‌పై ప్రభుత్వం రేపు మధ్యాహ్నం వరకు సమయం కోరిందని, ప్రభుత్వం ఆయనను త్వరలో తొలగిస్తుందని ఆశిస్తున్నామని రాంకా అన్నారు. “ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం, ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లు, చట్టపరమైన కేసులను ఉపసంహరించుకోవడం అనే రెండు డిమాండ్లపై ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది” అని ఆయన చెప్పారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, ఆత్మహత్యకు పాల్పడిన నీట్ ఔత్సాహికుల కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని, నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లు, చట్టపరమైన కేసులను ఉపసంహరణ ఈ మూడు డిమాండ్లను సీజేపీ ముందుంచింది.మరోవైపు, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తప్ప మరోదానికి అంగీకరించేది లేదని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మరోసారి నొక్కి చెప్పారు. “ఈ నిరసనకు ప్రభుత్వం పరిష్కారం కోరుకుంటే, అది ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా మాత్రమే” దీప్కే స్పష్టం చేశారు. “మేము వెనక్కి తగ్గం, రాజీనామాకు మించి ఏదీ ఆమోదయోగ్యం కాదు” అని దీప్కే తన డిమాండ్‌ను పునరుద్ఘాటించారు. కీలక డిమాండ్లపై ప్రభుత్వం హామీ ఇవ్వడంతో గురువారం అర్ధరాత్రి సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్షను విరమించారు. 26 రోజుల పాటు వాంగ్‌చుక్ దీక్ష కొనసాగింది. వాంగ్‌చుక్ నిరసనను విరమించుకోమని కోరితే ఏం చేస్తారని ప్రశ్నించగా “ఈ ఉద్యమం ఇకపై కేవలం అభిజీత్ దీప్కే, సోనమ్ వాంగ్‌చుక్‌లకు మాత్రమే పరిమితం కాదు, ఇది యావత్ దేశవ్యాప్త యువత ఉద్యమంగా మారింది అందుకే దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయి. అందువల్ల, రాజీనామా చేయడం తప్ప మరేదీ ఆమోదయోగ్యం కాదు” అని దీప్కే తేల్చిచెప్పారు.

## జెన్-జీ పవర్‌ను తక్కువ అంచనా వేయకండి

ఉదాహరణగా చూపుతూ, యువత ఏకమై రోడ్డెక్కితే ఎంతటి నిరంకుశ ప్రభుత్వాలైనా కూలిపోక తప్పదని కేటీఆర్ ఘాటు హెచ్చరికలు జారీ చేశారు.ప్రజాస్వామ్యంలో అధికారంలో ఉన్న పాలకులు యువత ఆకాంక్షలను విస్మరిస్తే ఎదురయ్యే పరిణామాలు దారుణంగా ఉంటాయని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఈ తరం చావుకు భయపడదు. ఆకలి, నిరుద్యోగం, భవిష్యత్తుపై అభద్రతాభావంతో వారు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఈ ఆగ్రహం అడుగడుగునా ఉవ్వెత్తున లేచి మోదీ ప్రభుత్వానికి సవాలు విసరడం ఖాయం. ఈ విషయాన్ని మోదీ గుర్తుంచుకోవాలి అని ఆయన స్పష్టం చేశారు. ఒకవైపు నిరుద్యోగ సమస్యలతో నలిగిపోతున్న యువతకు ఆసరాగా నిలవాల్సింది పోయి, ప్రచార ఆర్భాటాలకే పరిమితమవడం సరికాదని విమర్శించారు.ప్రధాని మోదీ ప్రచార శైలిపై నేరుగా ప్రశ్నలు సంధించిన కేటీఆర్ టీవీల్లో, మీడియాలో ఆర్నెల్లకోసారి పరీక్ష పే చర్చ పేరుతో ఉపన్యాసాలు దంచే ప్రధాని, దేశవ్యాప్తంగా వరుసగా జరుగుతున్న పోటీ పరీక్షల పేపర్ లీకేజీలపై ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు, వారి ఏళ్ల తరబడి కష్టం ప్రశ్నార్థకంగా మారుతుంటే కేంద్రం మౌనం వహించడం విద్యార్థి లోకాన్ని ద్రోహం చేయడమేనని అన్నారు. ఢిల్లీ వేదికగా ఆందోళన బాట పట్టిన విద్యార్థులకు, నిరుద్యోగులకు బీఆర్ఎస్ పూర్తిగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఢిల్లీ మరియు దేశవ్యాప్తంగా విద్యార్థులు చేపట్టిన నిరసనలపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్రంగా స్పందించారని కేటీఆర్ వెల్లడించారు. సోషల్ మీడియాలో విద్యార్థుల పోరాటాలను చూసి కేసీఆర్ చలించిపోయారని, విద్యార్థులకు మద్దతుగా అవసరమైతే కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగి ప్రత్యక్ష పోరాటంలో పాల్గొంటారని ప్రకటించారు. కరోనా మహమ్మారి సమయంలో కూడా ఈ దేశ స్వరూపాన్ని మార్చేది, భవిష్యత్తును కాపాడేది యువతే అని కేసీఆర్ చెప్పిన మాటలను ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేశారు. తెలంగాణ నుంచి జాతీయ స్థాయి వరకు విద్యార్థి, నిరుద్యోగ పోరాటాలకు బీఆర్ఎస్ పూర్తి మద్దతు ప్రకటిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నేతలను ఇప్పటికే ఢిల్లీకి పంపి నిరసనల్లో భాగస్వాములను చేస్తున్నామని, కేంద్రం దిగివచ్చి విద్యావ్యవస్థలో పారదర్శకత తీసుకొచ్చే వరకు ఈ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. యువత ఆగ్రహ జ్వాలలకు కేంద్రం సమాధానం చెప్పుకోక తప్పదని, విద్యార్థుల వైపు నిలబడటమే బీఆర్ఎస్ ప్రథమ ప్రాధాన్యత అని కేటీఆర్ పేర్కొన్నారు.

## ప్రభుత్వ స్కూళ్ల బ్రేక్‌ఫాస్ట్ స్కీంకు విరాళాల వెల్లువ

భాగంగా అరబిందో ఫార్మా, దివీస్ లేబొరేటరీస్ సంస్థలు కలిపి రూ.22.18 కోట్ల విరాళాన్ని ఈ బ్రేక్ ఫాస్ట్ పథకానికి అందించాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఈ నిధులను హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్‌కు ఆ సంస్థల ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా అరబిందో ఫార్మా రూ.10 కోట్లు దివీస్ లేబొరేటరీస్ రూ.12.18 కోట్లను విరాళంగా ప్రకటించాయి. ఈ నిధులతో తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారాన్ని మరింత సమర్థంగా అందించడంతో పాటు మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని కూడా బలోపేతం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు.

ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం, విద్యాభ్యాసం మెరుగుపడేందుకు కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం చాలా సంతోషకరమని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడమే కాకుండా రైతులకు కూడా ఈ పథకం ద్వారా ప్రయోజనం కలిగేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. సెంట్రలైజ్డ్ కిచెన్లకు అవసరమైన బియ్యం, కూరగాయలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను స్థానికంగా పంటను పండించే రైతుల నుంచే నేరుగా కొనుగోలు చేసే విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. రైతులను సేంద్రియ వ్యవసాయం వైపు ప్రోత్సహించడం నాణ్యమైన విత్తనాలు అందించడం, పంట మార్పిడి విధానాన్ని ప్రోత్సహించడం ద్వారా వ్యవసాయ రంగానికి ఊతమివ్వాలని సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది.

# హిమాచల్‌లో విషాదం..

షిమ్లా (ప్రశ్న న్యూస్) హిమాచల్ ప్రదేశ్‌లోని మారుమూల లాహౌల్-స్పితి జిల్లాలో శుక్రవారం ఘోర విషాదం చోటుచేసుకుంది. భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడటంతో ఓ టాటా సుమో వాహనం నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో 13 మంది ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో ఆ వాహనం కుల్లు నుంచి పంగికి ప్రయాణిస్తోంది. ఉదయ్‌పూర్-కిల్లార్ రహదారిలోని కదు నల్లా సమీపంలో ఈ దుర్ఘటన జరిగింది. అంతకుముందు రోజు కొండచరియలు విరిగిపడటంతో అధికారులు ఈ మార్గాన్ని మూసివేశారు. దీంతో ప్రయాణికులతో ఉన్న ఆ వాహనం టిండి గ్రామంలో రాత్రంతా నిలిచిపోయింది. శుక్రవారం ఉదయం అధికారులు మార్గాన్ని పునరుద్ధరించడంతో టాటా సుమో తన ప్రయాణాన్ని తిరిగి ప్రారంభించింది. అయితే, ప్రయాణం మొదలైన కొద్దిసేపటికే భారీ బండరాళ్లు వాహనంపై పడటంతో ఈ పెను ప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు, జిల్లా యంత్రాంగం మరియు విపత్తు ప్రతిస్పందన బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. ఈ ప్రమాదంలో 13 మంది మరణించినట్లు అధికారులు ధ్రువీకరించారు. గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం మృతుల వివరాలను సేకరిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# చదువే పిల్లలకు శాశ్వత ఆస్తి

ప్రణాళికలపై మార్గదర్శనం చేశారు. తన వయస్సు, నిరంతర శ్రమను ప్రస్తావిస్తూ సీఎం చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 60 ఏళ్లు రాగానే జీవితం ముగిసిపోయిందని భావించి చాలామంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటారు. కానీ 76 ఏళ్ల వయసులోనూ పడుకునే సమయం తప్ప ప్రతి క్షణం యంత్రంలా పనిచేస్తున్నానంటే దానికి కారణం నాలోని సంకల్పమే. నేను గతం గురించి మాత్రమే మాట్లాడే వ్యక్తిని కాను, రేపటి తరాన్ని నిర్మించే భవిష్యత్తు విజన్‌ను అని సీఎం పేర్కొన్నారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల నుంచి డిజిటల్ విప్లవం వరకు గిరిజన విద్యార్థులు ప్రపంచ స్థాయి పోటీకి సిద్ధం కావాలనేది తన ఆశయమని తెలిపారు.విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పనితీరుపై ముఖ్యమంత్రి ప్రశంసల వర్షం కురిపించారు. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో లోకేష్ ఏరికోరి విద్యాశాఖను ఎంచుకున్నారు. ఆనాడు ఈ శాఖను ఎందుకు అడిగారో ఈరోజు నాకూ, రాష్ట్ర ప్రజలకూ స్పష్టంగా అర్థమైంది. విద్యావ్యవస్థలో ఆయన విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు అని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల పురోగతిని పర్యవేక్షించే క్రమాన్ని వివరిస్తూ మీకు మార్కులు తగ్గితే లోకేష్‌కు మార్కులు తగ్గుతాయి! ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులకు మంచి మార్కులు వేస్తే విద్యాశాఖ మంత్రిగా పనితీరు ఆధారంగా ముఖ్యమంత్రిగా నేను లోకేష్‌కు మార్కులు వేస్తా అని చమత్కరించారు. గిరిజన ప్రాంత పాఠశాలలను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు తల్లికి వందనం , లీప్ యాప్ వంటి సాంకేతిక వినూత్న విధానాల ద్వారా ప్రతి ఒక్క విద్యార్థి ప్రతిభను వెలికితీసేలా చర్యలు చేపట్టామన్నారు. విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలు పెంపొందించుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై రోజూ దృష్టి సారించాలని సూచించారు. గత ప్రభుత్వం విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేసిందని, తాము అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ ద్వారా 16,000 పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టి, విద్యావ్యవస్థకు పూర్వవైభవం తీసుకొచ్చామని గుర్తుచేశారు.అనంతరం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు విద్యాశాఖ అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి ఆస్వాదించారు. లబ్ధిదారులైన తల్లికి వందనం తల్లిదండ్రులతో నేరుగా ముచ్చటించి పథకాల అమలుపై వారి అభిప్రాయాలు సేకరించారు. విద్యార్థులు నాటిన మొక్కలకు జారీ చేసిన గ్రీన్ పాస్‌పోర్టులు , క్యూఆర్ కోడ్‌లను సీఎం పరిశీలించారు. రాబోయే రోజుల్లో ఏపీ మోడల్ ఎడ్యుకేషన్‌ను దేశానికే ఆదర్శంగా నిలపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి తన ప్రసంగాన్ని ముగించారు.

## పేపర్ లీకేజీ చట్టం కఠినతరం!

తాజా సవరణలతో వాటిని మరింత పటిష్ఠం చేయనున్నారు. దేశవ్యాప్తంగా సుమారు 22 లక్షల మంది విద్యార్థులు హాజరైన నీట్-యూజీ 2026 పరీక్ష పత్రం లీక్ కావడంతో, ఆ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించిన సంగతి విదితమే. ఈ పరిణామంతో పాటు పలు ఇతర పోటీ పరీక్షల్లోనూ అక్రమాలు చోటుచేసుకోవడంతో విద్యార్థి లోకం నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.

## విద్యార్థుల ముసుగులో అరాచక శక్తులు

ఇప్పటికే పలువురిని అరెస్ట్ చేసి దర్యాప్తు ముమ్మరం చేసిందని వెల్లడించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన బండి సంజయ్ నీట్ అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు వాడుకుంటున్నారని ఆరోపించారు. ఢిల్లీలో జరిగిన ఆందోళనల్లో నిజమైన విద్యార్థుల కంటే మతతత్వ, కమ్యూనిస్టు భావజాల శక్తులు చొరబడి హింసకు పాల్పడ్డాయని విమర్శించారు. పార్లమెంట్‌ను లక్ష్యంగా చేసుకుని దాడికి కుట్ర జరిగిందని దేశ వ్యతిరేక నినాదాలతో పరిస్థితిని ఉద్రిక్తం చేసే ప్రయత్నం చేశారని ఆరోపించారు.ఢిల్లీలో సీజేపీ ఆందోళనల సమయంలో పోలీసులు, మీడియా ప్రతినిధులపై దాడులు జరిగాయని 118 మంది పోలీసు సిబ్బంది గాయపడినప్పటికీ పోలీసులు అత్యంత సంయమనంతో వ్యవహరించారని బండి సంజయ్ పేర్కొన్నారు. పరిస్థితి అదుపు తప్పకుండా ఉండేందుకు చివరి మార్గంగా మాత్రమే వారు లాఠీచార్జ్ చేయాల్సి వచ్చిందని తెలిపారు. విదేశీ సోషల్ మీడియా అకౌంట్ల ద్వారా దేశంలో ఉద్రిక్తతలు రెచ్చగొట్టే ప్రయత్నాలు జరిగాయని పాకిస్థాన్‌కు చెందిన వందలాది అకౌంట్లను కేంద్రం బ్లాక్ చేసిందని తెలిపారు.ఈ సందర్భంగా దేశంలోని ప్రతిపక్షాలపై కూడా బండి సంజయ్ తీవ్ర విమర్శలు చేశారు. నీట్ సమస్య పరిష్కారం కంటే ప్రధాని నరేంద్ర మోదీని గద్దె దించి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడమే ఇండియా కూటమి లక్ష్యమని సంచలన ఆరోపణలు చేశారు. అందుకే ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామాలు చేయాలని డిమాండ్ చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో వివిధ రాష్ట్రాల్లో జరిగిన పేపర్ లీక్ ఘటనలను ప్రస్తావించిన బండి సంజయ్.. కాంగ్రెస్, ఆప్, బీఆర్ఎస్ ప్రభుత్వాల హయాంలో కూడా ఆయా రాష్ట్రాల్లో పలు పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని గుర్తు చేశారు. అప్పుడు ఆయా ముఖ్యమంత్రులు లేదా మంత్రులు రాజీనామా చేశారా అని ప్రశ్నించారు. తెలంగాణలో టీఎస్‌పీఎస్సీ, ఎంసెట్, పదో తరగతి ప్రశ్నాపత్రాల లీక్‌ల సమయంలో బీఆర్ఎస్ నేతలు బాధ్యత తీసుకోలేదని విమర్శించారు. ప్రజల సమస్యలను పక్కనబెట్టి రాజకీయ లబ్ధి కోసం ఉద్యమాలను వాడుకోవడం సరికాదని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

## జనసేన పార్టీలో కమిటీల నియామకం

అధికారిక కార్యక్రమాలు, సమీక్షలలో పాల్గొంటున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే జనసేన సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించి నాయకత్వ బాధ్యతల కోసం పార్టీ శ్రేణుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. జనసేన శ్రేణుల నుంచి దరఖాస్తులను పరిశీలించి ఎవరికి ఏ బాధ్యతలు అప్పగిస్తే వారు బలంగా పనిచేయగలరో అంచనా వేస్తున్నారు. వారి నాయకత్వ సామర్థ్యం, పార్టీ పట్ల అంకితభావం, సేవా కార్యక్రమాలు, రాజకీయ అనుభవం, పార్టీ కోసం కేటాయించగల సమయం వంటి పలు ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని రక్షా దళ్, పరిపాలక్ దళ్, నిర్వాహక్ దళ్, వివాద విమోచన్ మండలి, అధికార ప్రతినిధులు, అలాగే పలు పార్టీ విభాగాలకు సంబంధించిన కమిటీలను పవన్ కల్యాణ్ కమిటీ సభ్యులను ఖరారు చేయనున్నారు.రాష్ట్రంలోని 25 పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన దరఖాస్తులను పరిశీలించి నియామక ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం అన్ని కమిటీలను అధికారికంగా ప్రకటించనున్నారని జనసేన పార్టీ తెలిపింది. పార్టీ కోసం క్షేత్రస్థాయిలో అంకితభావంతో పనిచేస్తున్న జనసేన శ్రేణులకు సంస్థాగత నిర్మాణంలో సముచిత స్థానం కల్పించడంతో పాటు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీని గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ నియామక కసరత్తు చేపట్టినట్టుగా పేర్కొంది. ఇక, ఆగస్టు 15 నాటికి రాష్ట్రవ్యాప్తంగా జనసేన పార్టీ కమిటీల నియామకాన్ని పూర్తి చేసి, జనసేన పార్టీని సంస్థాగతంగా మరింత బలమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దడంతో పాటు, కొత్త నాయకత్వాన్ని రాష్ట్రానికి పరిచయం చేయాలనే లక్ష్యంతో ఈ ప్రక్రియను చేపట్టినట్టుగా పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.ఇదిలాఉంటే, జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు జూన్ 29 నుంచి వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా 25 పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో పార్టీ బాధ్యతలు చేపట్టి, క్షేత్రస్థాయిలో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన జనసేన నాయకులు, సాధక్స్, జనసైనికుల నుంచి సమాచారం సేకరించేందుకు జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ బృందాలను పవన్ కల్యాణ్ నియమించారు. ఈ కమిటీ బృందాలు ఆయా పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో దరఖాస్తులు సేకరించాయి. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా జనసేన శ్రేణులు పంచాయతీ నుంచి పార్లమెంట్ స్థాయి వరకు వివిధ స్థాయిల్లో పార్టీ బాధ్యతలు తీసుకునేందుకు దాదాపు 36 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. వాటిని ప్రస్తుతం పవన్ కల్యాణ్ పరిశీలించనున్నారు.

### కోర్టు దృశ్యాలను ప్రసారం చేయడంపై

# సుప్రీంకోర్టు ఆగ్రహం

సంబంధిత కోర్టుల ముందస్తు అనుమతి లేకుండా వాటిని పోస్ట్ చేయడం, ఎడిట్ చేయడం లేదా రీ-పోస్ట్ చేయడంపై మధ్యంతర స్టే విధిస్తూ సంచలన ఆదేశాలు జారీ చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ జరిపింది.

సుప్రీంకోర్టు సెక్రటరీ జనరల్ లేదా ఆయా హైకోర్టుల రిజిస్ట్రార్ జనరల్ ముందస్తు అనుమతి లేకుండా విచారణల వీడియోలను ఎక్స్‌ట్రాక్ట్ చేయడం, మార్పులు చేయడం, సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడం లేదా వాటి ద్వారా ఆదాయం పొందడం పూర్తిగా నిషిద్ధమని స్పష్టం చేసింది. అయితే ఈ ఉత్తర్వులు సాధారణ వార్తా కవరేజ్ లేదా జర్నలిజం రిపోర్టింగ్‌పై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపవని, ఇవి భావవ్యక్తీకరణ స్వేచ్ఛను అడ్డుకునే ఉత్తర్వులు కాదని ధర్మాసనం తెలిపింది. విచారణ క్లిప్‌లు వైరల్ కావడంపై వివరణ ఇవ్వాలని మెటా, ఎక్స్ సహా పలు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లకు అత్యున్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి మాట్లాడుతూ కోర్టులు 24 గంటల ఎంటర్‌టైన్‌మెంట్ ఛానెళ్లు కావు అని స్పష్టం చేశారు. వర్చువల్ లింక్‌లు దుర్వినియోగం కాకుండా పరిమిత యాక్సెస్ మాత్రమే ఉండాలని అభిప్రాయపడ్డారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ ఏఐ టూల్స్ ఉపయోగించి న్యాయమూర్తులు లేదా లాయర్ల మాటలను మార్చి మార్ఫింగ్ చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

# నీట్ లీక్‌పై కేంద్రం ఉక్కుపాదం

విచారణ జరిపి దోషులకు కఠిన శిక్షలు పడేలా చూడటమే కాకుండా, నూతన యాంటీ పేపర్ లీక్ చట్టాలను పటిష్ఠంగా అమలు చేయనున్నారు. దీనివల్ల భవిష్యత్తులో ఏ ఒక్క అధికారి లేదా ఏజెన్సీ అక్రమాలకు పాల్పడకుండా బలమైన వ్యవస్థను నిర్మించాలనేది కేంద్ర ఆలోచన. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ప్రశ్నాపత్రాలను పూర్తిగా డిజిటలైజ్ చేయడం, ఎన్‌క్రిప్టెడ్ పద్ధతిలో చివరి క్షణంలో పరీక్షా కేంద్రాలకు చేరవేయడం, ఏఐ ప్రాసెసింగ్ ద్వారా మోసాలను అరికట్టేలా సాంకేతిక సంస్కరణలు ప్రవేశపెడుతున్నారు.

నీట్ మాత్రమే కాకుండా జేఈఈ మెయిన్స్, సీయూఈటీ వంటి 15 నుంచి 20 జాతీయ స్థాయి పరీక్షలను అత్యంత పారదర్శకంగా, లీక్ ప్రూఫ్ వ్యవస్థగా మార్చడమే లక్ష్యంగా ఈ రీస్ట్రక్చరింగ్ ప్లాన్‌ను అమలు చేస్తున్నారు.దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అనుభవిస్తున్న మనోవేదనను దృష్టిలో ఉంచుకుని, ఎన్టీఏపై కోల్పోయిన నమ్మకాన్ని పునరుద్ధరించేందుకే ప్రధాని కార్యాలయం ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ మార్పులు చేపడుతున్నారు. ఈ భారీ ప్రక్షాళన ద్వారా జాతీయ పరీక్షల విధానంలో సుదీర్ఘకాలంగా పేరుకుపోయిన లోపాలు తొలగిపోతాయని, భవిష్యత్తులో అర్హులైన విద్యార్థులకు న్యాయం జరుగుతుందని విద్యావేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### విద్యార్థుల అభ్యున్నతికి

# ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

**- డాక్టర్ కందుల నాగరాజు**

**విశాఖపట్నం** విద్యార్థుల అభ్యున్నతికి తల్లిదండ్రులు అలాగే అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం చైర్మన్, దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు డాక్టర్ కందుల నాగరాజు పేర్కొన్నారు.విశాఖలో రైల్వే స్కూల్లో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగాఎన్.సి.సి.క్యాడెట్స్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత భవిష్యత్ కి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర కీలకం కనుకనే రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా మెగా తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసిందని తెలిపారు.విద్యార్థులకు తల్లి దండ్రులే తొలిగురువులన్నారు. వారి బంగారు భవిష్యత్తుకు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు. సమాజంలో ఎవరు ఏ వృత్తి చేపట్టినా వారిని తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని తెలిపారు.ఇటువంటి సమావేశం ద్వారానే పేరంట్స్, టీచర్ల ఇరువురి మధ్య స్నేహ, ఆత్మీయ బంధం ఏర్పడుతుందన్నారు. తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే పాఠశాలల అభివృద్ధి సాధ్యమని చెప్పారు.విద్యార్థులు యుక్త వయస్సులో దారితప్పకుండా మంచి అలవాట్లును పాటిస్తూ బాగా చదువుకోవాలని సూచించారు.విద్యార్థులు పునాది నుంచే సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు.విద్యార్థులనుతీర్చిదిద్దబడడానికి ఉపాధ్యాయుల స్పూర్తి ఎంత కీలకమో తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా ప్రధానమన్నారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రపంచ దేశాల్లోని మెరుగైన విద్యా విధానాలను పరిశీలించి, రాష్ట్రంలో అమలు చేయడం ద్వారా ప్రభుత్వ స్కూల్స్ ని బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థులకు ఒత్తిడిలేని విద్యను అందిస్తూ, వారిలోని ప్రతిభను గుర్తిస్తే వారు ఉన్నంతంగా అభివృద్ధి చెందుతారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను షోకేస్ లో బొమ్మలుగా చూడకుండా వారికీ సమాజం పట్ల అవగాహన కలిగేలా చూడాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సమర్థవంతమైన నాయకత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి వేగంగా జరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలోరైల్వే స్కూల్ హెడ్మాస్టర్‌వై.మీనాక్షి,కె.సాయి విమల, కుమారి,ఆర్.ప్రసన్న కుమార్, జె.ఏ.ఎస్ రాజా, ఇ.ఎం.సుశీల,ఏ.మణిపి.సుధ,జయ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

**- కలెక్టర్ చిత్రా మిశ్రా**

**కరీంనగర్** కరీంనగర్ లోఎల్ నినో ప్రభావంతో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. మిషన్ భగీరథతో పాటు ఇతర తాగునీటి సరఫరా వ్యవస్థల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ అధికారులతో తాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీల పరిధిలో రోజువారీ నీటి అవసరాలు, సరఫరా పరిస్థితులు, నీటి పొదుపు కోసం చేపడుతున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఎక్కడైనా తాగునీటి పైపులైన్లకు లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. వార్డుల వారీగా పనిచేస్తున్న బోర్లు, వినియోగంలో లేని బోర్లను గుర్తించి అవసరమైన మరమ్మతులు చేసి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.కార్పొరేషన్ పరిధిలోని కొత్తపల్లి-ఎలగందుల, బొమ్మకల్, విద్యారణ్యపురి, అలుగునూరు, చింతకుంట ప్రాంతాలతో పాటు ఇటీవల విలీనమైన గ్రామాల్లో తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే జమ్మికుంట, హుజురాబాద్, చొప్పదండి మున్సిపాలిటీలు, గంగాధర, గన్నేరువరం మండలాల్లో నీటి అవసరాలు, వినియోగం, సరఫరా పరిస్థితులను సమీక్షించారు.ఎల్ఎండీ రిజర్వాయర్‌లో నీటి నిల్వలను ప్రతిరోజూ పర్యవేక్షించాలని, డెడ్ స్టోరేజ్ పరిస్థితి ఏర్పడకముందే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గన్నేరువరం మండలంలోని హనుమాజిపల్లి?జంగంపల్లి ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే గంగాధర మండలంలోని నారాయణపూర్ చెరువు నీటిని గంగాధర, చొప్పదండి మండలాల తాగునీటి అవసరాలకు వినియోగించే అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు.సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా ఓవర్‌హెడ్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని, పైపులైన్ లీకేజీలు, నిర్వహణ లోపాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ నల్లా కనెక్షన్లను తొలగించి నీటి వృథాను అరికట్టాలని అధికారులకు ఆదేశించారు.జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ప్రజల్లో నీటి పొదుపుపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సూచించారు. సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించాలని, అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఈఈలు రామ్‌కుమార్, సందీప్‌కుమార్, పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్‌రావు, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు

### రాష్ట్రంలో 51%, కృష్ణా డెల్టాలో

# 49% వర్షపాతం లోటు

**- వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలి**

**విజయవాడ** కృష్ణా డెల్టా నీటి పరిస్థితిపై ఇరిగేషన్ ఈఎన్సీ కే. నరసింహ మూర్తి విజయవాడ ఇరిగేషన్ కాంపౌండ్ లో మీడియతో మాట్లాడారు. రాష్ట్రంలో 51%, కృష్ణా డెల్టాలో 49% వర్షపాతం లోటు నమోదయింది. ఎల్నినో ప్రభావంతో కృష్ణా పరివాహక ప్రాంతంలో వర్షాలు తగ్గాయి. ఎగువ ప్రాజెక్టుల్లో కుషన్ నీటి కారణంగా శ్రీశైలానికి ప్రవాహాలు తగ్గాయి. ప్రభుత్వం తాగునీటికే తొలి ప్రాధాన్యత ఇచ్చింది. 2027 జూన్ వరకు తాగునీటి అవసరాల కోసం నీటి నిర్వహణ చేసామని అన్నారు.పులిచింతల నీటిని కూడా తాగునీటి అవసరాల కోసం భద్రపరిచారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీటి సరఫరా కొనసాగుతోంది. గోదావరిలో ప్రవాహాలు తగ్గడంతో పట్టిసీమ పంపింగ్పై ప్రభావం పడింది సీలేరు నీటి లభ్యత కూడా తగ్గింది. కృష్ణా డెల్టా సాగుకు అవసరమైన నీటి లభ్యత ప్రస్తుతం లేదు. పట్టిసీమలో అన్ని పంపులను ఒకేసారి నడపడం సాధ్యం కావడం లేదు. ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల 60 లక్షల మందికి తాగునీటికి ప్రాధాన్యత ఇస్తున్నాం. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించి తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడించారు..ఆర్ఎంసీ నుంచి అనధికారికంగా నీరు తీసుకోవద్దని రైతులకు విజ్ఞప్తి చేస్తున్నాం. అనధికారిక పంపుల వినియోగాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఆర్ఎంసీ పరిధిలో ప్రస్తుతం వరి సాగు చేయవద్దని సూచిస్తున్నాం. మధ్యలో నీరు లేక పంట నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నాం. భవిష్యత్తులో నీటి లభ్యత పెరిగితే వ్యవసాయ శాఖతో కలిసి నిర్ణయం తీసుకుంటాం. తాగునీటి తర్వాతే ఆరుతడి పంటలకు నీటి కేటాయింపు జరుగుతుంది. కృష్ణా డెల్టా పరిధిలో వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలి. అసాధారణ పరిస్థితులను రైతులు అర్థం చేసుకుని విజ్ఞతతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు.

# రెండేళ్ల పాలన.. అభివృద్ధి బాటలో పలాస

## - ఇంటింటికీ తీసుకెళ్లండి: ఎమ్మెల్యే గౌతు శిరీష పిలుపు



**పలాస(ప్రశ్న న్యూస్)** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజల జీవితాల్లో తీసుకొచ్చిన మార్పులను ప్రతి ఇంటికీ చేరవేయాలని ఆమె క్లస్టర్, యూనిట్, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ప్రజలతో మరింత మమేకమై ప్రభుత్వ పనితీరును వివరించాలని సూచించారు. గౌతు శిరీష మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమతూకంగా ముందుకు తీసుకెళ్తూ రాష్ట్రాన్ని పురోగతి దిశగా నడిపిస్తున్నామని చెప్పారు. ఈ రెండేళ్లలో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా ప్రభుత్వం అనేక నిర్ణయాలు తీసుకుందని ఆమె వివరించారు.

**రూ.1,000 కోట్ల అభివృద్ధి పనులు** నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇచ్చిందని, గత రెండేళ్లలో సుమారు రూ.1,000 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తయ్యాయని గౌతు శిరీష తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, విద్యుత్ మౌలిక వసతులు, ప్రజా భవనాల నిర్మాణం వంటి అనేక పనులు వేగంగా పూర్తయ్యాయని చెప్పారు. ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పలు ప్రాజెక్టులు ఇప్పుడు కార్యరూపం దాల్చడం ఈ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. అభివృద్ధి అనేది కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రజల కళ్లకు కనిపించేలా జరుగుతోందని ఆమె వివరించారు. కేంద్రీయ విద్యాలయం.. నియోజకవర్గానికి గర్వకారణంనియోజకవర్గంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కావడం చారిత్రాత్మక ఘట్టమని గౌతు శిరీష పేర్కొన్నారు. దీని ద్వారా స్థానిక విద్యార్థులు నాణ్యమైన విద్యను తమ ప్రాంతంలోనే పొందే అవకాశం కలిగిందన్నారు. ఉన్నత ప్రమాణాల విద్య అందుబాటులోకి రావడం వల్ల గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. విద్యారంగాన్ని బలోపేతం చేయడమే భవిష్యత్ తరాలకు ప్రభుత్వం అందిస్తున్న గొప్ప పెట్టుబడిగా ఆమె అభివర్ణించారు.

**త్వరలో ప్రజలకు రైల్వే ఓవర్ బ్రిడ్జి** ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదురుచూస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం తుది దశకు చేరుకుందని ఎమ్మెల్యే తెలిపారు. వచ్చే నెలలో పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఈ బ్రిడ్జి పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గడంతో పాటు ప్రజల ప్రయాణ సమయం ఆదా అవుతుందని చెప్పారు. వ్యాపార, రవాణా రంగాలకు కూడా ఇది ఎంతో ఉపయోగకరంగా మారుతుందని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో ప్రభుత్వం చేసిన పనులను ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారని, అదే తమకు పెద్ద బలమని తెలిపారు. అభివృద్ధి రాజకీయాలకు అతీతమని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

**స్థానిక ఎన్నికల్లో అభివృద్ధే అజెండా** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే ప్రధాన అజెండాగా ఉంటాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల విశ్వాసంతోనే కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అదే విశ్వాసం స్థానిక ఎన్నికల్లో కూడా విజయాన్ని అందిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు ప్రజల్లో సానుకూల వాతావరణాన్ని మరింత బలోపేతం చేయాలని, ప్రభుత్వ విజయాలను వాస్తవాలతో వివరించాలని సూచించారు. ప్రతి బూత్‌లో బలమైన సంస్థాగత నిర్మాణం కల్పించి ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు.

**సమిష్టి కృషితో విజయ లక్ష్యం** "రెండేళ్ల అభివృద్ధి -- ప్రజల ముంగిట" అనే లక్ష్యంతో ప్రతి కార్యకర్త పనిచేయాలని గౌతు శిరీష పిలుపునిచ్చారు. ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించడం ప్రతి నాయకుడి బాధ్యత అని అన్నారు. అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరాయని, ఇప్పుడు ఆ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేస్తే రానున్న ఎన్నికల్లో ఘన విజయం సాధించడం ఖాయమని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజల ఆశీర్వాదంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని గౌతు శిరీష స్పష్టం చేశారు.

# విజయవాడ కార్పొరేషన్‌లో కూటమిదే జెండా

## - జనసేనను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలి

## - కూటమి ధర్మంతో ముందుకెళ్తూ స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి: మంత్రి కందుల దుర్గేష్



**విజయవాడ(ప్రశ్న న్యూస్)** విజయవాడ కార్పొరేషన్‌తో పాటు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ--జనసేన--బీజేపీ కూటమి ఘనవిజయం సాధిస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూనే జనసేన పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. విజయవాడలో శుక్రవారం నిర్వహించిన జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళల అత్యవసర సమీక్షా సమావేశంలో మంత్రి, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడిగా పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

**స్థానిక ఎన్నికలే లక్ష్యం** రాబోయే కార్పొరేషన్, స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని మంత్రి సూచించారు. జనసేన సంస్థాగత బలం పెరిగితే కూటమిలో మరిన్ని స్థానాల్లో పోటీ చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. విజయవాడ నగరంలో జనసేన జెండా మరింత బలంగా ఎగరాలని, ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజల్లోనే ఉండాలని సూచించారు.

**పేదల పార్టీ జనసేన** 2014 నుంచి పార్టీ సిద్ధాంతాలను నమ్ముకుని పనిచేస్తున్న కార్యకర్తలే జనసేనకు అసలైన బలం అని దుర్గేష్ అన్నారు. ఆటో డ్రైవర్లు, రిక్షా కార్మికులు, దినసరి కూలీలు తమ కష్టార్జితాన్ని పార్టీ కోసం వెచ్చించారని గుర్తుచేశారు. కులాలు, వర్గాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల ఆశయాలకు ప్రతినిధిగా జనసేన ఎదిగిందని చెప్పారు.

**విజయవాడలో కూటమిదే విజయం** ప్రస్తుత రాజకీయ పరిస్థితులు కూటమికి పూర్తిగా అనుకూలంగా ఉన్నాయని, విజయవాడ కార్పొరేషన్‌తో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో నూటికి నూరు శాతం కూటమిదే విజయం అని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. గతంలో ప్రతికూల పరిస్థితుల్లోనూ విజయం సాధించిన జనసైనికులను ఆదర్శంగా తీసుకుని మరింత పట్టుదలతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

**అభ్యర్థులతో ముఖాముఖి** సమీక్ష సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్, ఇతర జనసేన నేతలు పార్టీ పదవులకు ఆసక్తి చూపిన అభ్యర్థుల నుంచి బయోడేటాలు స్వీకరించి, వారితో వ్యక్తిగతంగా మాట్లాడారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని సూచించారు. పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న వీర మహిళలు, జనసైనికులు, నాయకులకు మంత్రి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో జనసేన మరింత బలోపేతమై రానున్న ఎన్నికల్లో విజయదుందుభి మోగిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ బడులే భవిష్యత్తుకు బంగారు బాట

## - తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే విద్యా విప్లవం

## - రూ.1.94 కోట్లతో కేజీబీవీ ఫేజ్-2 భవన ప్రారంభం



**కోటబొమ్మాళి(ప్రశ్న న్యూస్)** ప్రభుత్వ పాఠశాలలను నాణ్యమైన విద్య, ఆధునిక సదుపాయాలతో ప్రైవేటు విద్యాసంస్థలకు ధీటుగా తీర్చిదిద్దుతూ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే విద్యా వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని, ప్రభుత్వం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి పనిచేస్తే ప్రభుత్వ బడులు దేశానికే ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. కోటబొమ్మాళి మండలం యలమంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన లిలిమెగా పేరెంట్స్--టీచర్స్ మీటింగ్ (పీటీఎం--4.0)లిలిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతకుముందు కోటబొమ్మాళి గ్రామంలోని లిలికస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లిలిలో రూ.1.94 కోట్ల వ్యయంతో నిర్మించిన ఫేజ్--2 భవనాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించి వారి చదువు, లక్ష్యాలు, భవిష్యత్ ఆశయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆ ఇద్దరి వ్యవహారశైలి..

# జిల్లాకు తలవంపులా.?

## - శ్రీకాకుళం రాజకీయాల్లో వివాదాల కలకలం

## - మాజీ స్పీకర్ తమ్మినేని, మాజీ మంత్రి సీదిరిపై పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష విమర్శలు



**పలాస(ప్రశ్న న్యూస్)** ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా రాజకీయాల్లో వ్యక్తిగత వివాదాలు, ఆరోపణలు జిల్లా ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాయని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష విమర్శించారు. ఒక కుటుంబం గౌరవం అందులోని సభ్యుల ప్రవర్తనపై ఆధారపడినట్లే, రాజకీయ పార్టీల ప్రతిష్ఠ కూడా ఆ పార్టీ నాయకుల నైతిక విలువలపై ఆధారపడి ఉంటుందని ఆమె పేర్కొన్నారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారామ్, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు వ్యవహారశైలిపై ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒకప్పుడు తెలుగుదేశం పార్టీలో ఉండి కీలక పదవులు నిర్వహించిన తమ్మినేని సీతారామ్, వైఎస్సార్‌సీపీలో చేరిన తర్వాత ఆయన రాజకీయ శైలి పూర్తిగా మారిపోయిందని ఆరోపించారు. తాజాగా వెలుగులోకి వచ్చినట్లు చెబుతున్న భూ వివాదాన్ని ప్రస్తావిస్తూ, సుమారు రూ.4 కోట్ల విలువైన భూమికి సంబంధించిన వ్యవహారంలో బ్రతికున్న వ్యక్తిని మరణించినట్లు చూపిస్తూ డెత్ సర్టిఫికెట్ పొందారని, అనంతరం కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాల ఆధారంగా ఆ భూమిని తన కుమారుడి పేరుకు మార్చుకునే ప్రయత్నం జరిగిందనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయని పేర్కొన్నారు. శాసనసభ స్పీకర్ వంటి అత్యున్నత రాజ్యాంగ పదవిని నిర్వహించిన వ్యక్తి పేరు ఇలాంటి వివాదాల్లో వినిపించడం బాధాకరమని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఉదంతాన్ని కూడా ఆమె ప్రస్తావించారు. రాజకీయ కక్షలు, సోషల్ మీడియా వేదికగా జరిగే ఆరోపణలు ఎంతటి విషాదాలకు దారితీస్తాయో గత సంఘటనలు గుర్తు చేస్తున్నాయని పేర్కొన్నారు. రాజకీయాల్లో విమర్శలు ప్రజాస్వామ్యంలో భాగమే అయినప్పటికీ, వ్యక్తిగత పరువును దెబ్బతీసే ప్రచారాలకు తావు ఉండకూడదన్నారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులు ప్రజలకు ఆదర్శంగా నిలవాలని, వివాదాలకు దూరంగా ఉండి ప్రజా విశ్వాసాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందని గౌతు శిరీష పేర్కొన్నారు.

# యంత్రాలతోనే పారిశుధ్యం

## - మాన్యువల్ స్కావెంజింగ్‌కు ముగింపు

## - రూ.2.10 కోట్ల రుణాలతో కొనుగోలు చేసిన ఆరు వాహనాలకు మంత్రి నారాయణ శ్రీకారం

## - సఫాయి కార్మికుల భద్రత, ఆర్థిక స్వావలంబనకే ప్రభుత్వ ప్రాధాన్యం



**నెల్లూరు(ప్రశ్న న్యూస్)** మాన్యువల్ స్కావెంజింగ్‌కు పూర్తిగా స్వస్తి పలికి, సాంకేతిక ఆధారిత పరిశుభ్రత వ్యవస్థను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. సఫాయి కార్మికుల భద్రత, గౌరవం, ఆర్థిక స్వావలంబన కోసం ఆధునిక యంత్రాల వినియోగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. నెల్లూరు నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో జాతీయ సఫాయి ఖర్మచారి అభివృద్ధి కార్పొరేషన్ రుణాల ద్వారా కొనుగోలు చేసిన నాలుగు నాలా క్లీనింగ్ యంత్రాలు మరియు రెండు 12 టన్నుల ట్రిప్పర్లను శుక్రవారం మంత్రి ప్రారంభించారు. అనంతరం నాలా క్లీనింగ్ యంత్రాన్ని స్వయంగా నడిపి సఫాయి కార్మికుల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో 22 మంది లబ్ధిదారులకు రూ.2.10 కోట్ల సబ్సిడీ రుణాలు మంజూరు చేశామని తెలిపారు. ఆ రుణాలతో రూ.1.10 కోట్ల విలువైన నాలుగు నాలా క్లీనింగ్ యంత్రాలు, రూ.1 కోటి విలువైన రెండు ట్రిప్పర్లు కొనుగోలు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత, అసిస్టెంట్ కమిషనర్ రేష్మా, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జెడ్పీటీసీ విజేతా రెడ్డి, నగర టీడీపీ అధ్యక్షుడు మామిడాల మధు, కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి, టీడీపీ నాయకులు కిన్నెర సాగర్, బాలాజీ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడులు ఇక గ్లోబల్ బాటలో

## - విద్యార్థుల సమగ్ర వికాసమే లక్ష్యం: మంత్రి నారాయణ

## - మెగా పేరెంట్--టీచర్స్ మీట్‌లో విద్యార్థులతో కలిసి భోజనం

## - 23 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత ఐఐటీ ఫౌండేషన్,

## - 10 వేల సైకిళ్ల పంపిణీ ప్రకటన




**నెల్లూరు (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్ది, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. నెల్లూరు నగరంలోని డీఎస్ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్--టీచర్స్ మీట్ 4.0లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, వారి తల్లిదండ్రులతో మంత్రి ఆత్మీయంగా ముచ్చటించారు. పిల్లల చదువు, అభిరుచులు, భవిష్యత్ లక్ష్యాల గురించి తెలుసుకుని వారికి ప్రోత్సాహాన్నిచ్చారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. డీఎస్ఆర్ ప్రభుత్వ పాఠశాలను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసిన డీఎస్ఆర్ కన్స్ట్రక్షన్స్ అధినేత దేవిరెడ్డి సుధాకర్ రెడ్డిని అభినందించి, సంస్థ ప్రతినిధి నాగరాజును సన్మానించారు. మంత్రి మాట్లాడుతూ, 2024 ఎన్నికల సమయంలో వీఆర్ పాఠశాల అభివృద్ధికి ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసి అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పునర్నిర్మించామని తెలిపారు. ఒకప్పుడు ఈ పాఠశాలలో చదివిన అనేక మంది నేడు ఉన్నత స్థానాల్లో సేవలందిస్తున్నారని గుర్తు చేశారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను దాతల సహకారంతో అభివృద్ధి చేయాలని నిర్ణయించగా, జిల్లాకు చెందిన పారిశ్రామికవేత్తలు, తన స్నేహితులు ముందుకు వచ్చి సహకరిస్తున్నారని చెప్పారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో సాధారణ తరగతి గదులతో పాటు విద్యార్థుల ప్రతిభను వెలికితీసేలా సంగీతం, క్రీడలు, కళలు, సైన్స్, సాంకేతికత వంటి రంగాలకు సంబంధించిన 18 ప్రత్యేక గదులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్న మంత్రి, పేరెంట్--టీచర్స్ మీట్‌ల ద్వారా విద్యార్థుల ఆసక్తులు, సామర్థ్యాలను గుర్తించి వారికి తగిన దిశానిర్దేశం చేయడమే ప్రభుత్వ ఉద్దేశమని వివరించారు. పిల్లలు పరీక్షల్లో విఫలమయ్యారని లేదా తక్కువ మార్కులు వచ్చాయని వారిని మందలించడం కంటే, తల్లిదండ్రులు సరైన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం ఇవ్వాలని సూచించారు. ప్రపంచంలోని ఏ దేశానికి వెళ్లినా నారాయణ విద్యాసంస్థల పూర్వ విద్యార్థులు కనిపిస్తారని, వారిని చూడటం ఒక ఉపాధ్యాయుడిగా తనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు మేయర్ దేవరకొండ సుజాత, డీఈఓ బాలాజీ రావు, ఎంఈఓ తిరుపాల్, పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బడే భవిష్యత్తుకు పునాది

## - ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి వసతులు

## - పిల్లలపై తల్లిదండ్రులు నిరంతరం నిఘా పెట్టాలి

## - కోటవురట్లలో కేజీబీవీ, ట్రెజరీ భవనాల ప్రారంభం

## - విద్యార్థులతో కలిసి భోజనం చేసిన హోంమంత్రి అనిత



**కోటవురట్ల(ప్రశ్న న్యూస్)** "గుడిని ఎంత పవిత్రంగా భావిస్తామో.. బడిని కూడా అంతే గౌరవించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ సౌకర్యాలు కల్పిస్తున్నాం. పిల్లల చదువుతో పాటు వారి ప్రవర్తనపైనా తల్లిదండ్రులు నిరంతరం దృష్టి పెట్టాలి" అని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మెగా పేరెంట్స్--టీచర్స్ సమావేశాలు విద్యా పండుగలా జరుగుతున్నాయని, ప్రభుత్వ విద్యలో తీసుకొస్తున్న సంస్కరణలు భవిష్యత్ తరాలకు బలమైన పునాదులు వేస్తాయని అన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలోని కోటవురట్ల మండలంలో శుక్రవారం పర్యటించిన హోంమంత్రి అనిత, రూ.1.68 కోట్లతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) నూతన భవనాన్ని, రూ.75 లక్షలతో నిర్మించిన ట్రెజరీ కార్యాలయం భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ హైస్కూల్‌లో నిర్వహించిన మెగా పేరెంట్స్--టీచర్స్ మీటింగ్లో పాల్గొని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మమేకమయ్యారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తూ వారి చదువు, లక్ష్యాల గురించి ఆప్యాయంగా మాట్లాడారు.

**లోకేష్ సంస్కరణలతో ప్రభుత్వ విద్యకు కొత్త రూపు** విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని హోంమంత్రి కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు ప్రతిభ కనబరిచే విద్యార్థులను ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర పురోగతికి విద్యార్థులు, ఉపాధ్యాయులే ప్రధాన బలమని పేర్కొన్నారు.

**పిల్లలపై తల్లిదండ్రులే తొలి గురువులు** పిల్లల ప్రవర్తన, స్నేహాలు, అలవాట్లపై తల్లిదండ్రులు నిరంతరం నిఘా ఉంచాలని మంత్రి సూచించారు. పేదరికం కారణంగా ఏ విద్యార్థి చదువుకు దూరం కాకుండా ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోందని చెప్పారు. 'తల్లికి వందనం' వంటి పథకాల ద్వారా కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని వివరించారు. విద్యా సంస్కరణలు, విద్యార్థుల సంక్షేమం, మాదకద్రవ్యాల నియంత్రణ, ఉపాధి అవకాశాల కల్పన అన్ని రంగాల్లో ప్రభుత్వం సమన్వయంతో ముందుకు సాగుతోందని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు.

# శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలో జ్యేష్ఠాభిషేక మహోత్సవాలకు శ్రీకారం

## - శతకలశ స్నపనం, మహాశాంతి హోమం... ఉత్సవమూర్తులకు వైభవంగా స్నపన తిరుమంజనం



**తిరుపతి(ప్రశ్న న్యూస్)** తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో అత్యంత వైభవంగా నిర్వహించే మూడు రోజుల జ్యేష్ఠాభిషేక మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఆషాఢ మాసంలో ఆలయ సంప్రదాయం ప్రకారం నిర్వహించే ఈ ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి అనుగ్రహాన్ని పొందారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం శ్రీ గోవిందరాజస్వామివారికి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఉదయం 8 గంటల నుంచి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శతకలశ స్నపనం మరియు మహాశాంతి హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తదుపరి ఆలయంలోని కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామివారి ఉత్సవమూర్తులకు వైభవంగా స్నపన తిరుమంజనం చేపట్టారు. పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు, కొబ్బరి నీరు వంటి పవిత్ర ద్రవ్యాలతో విశేష అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారి దివ్య కవచాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి కవచాధివాసం కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామివారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దివ్య దర్శనం ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కళకళలాడనున్నాయి. ఈ మహోత్సవాల్లో శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, ఆలయ ఏఈవో నారాయణ చౌదరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయులు, ఆలయ అర్చకులు, అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక సేవలు సమర్పించారు. జ్యేష్ఠాభిషేక మహోత్సవాలు మరో రెండు రోజుల పాటు వైభవంగా కొనసాగనున్నాయి.

# ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

**- వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి ఆర్థిక సాయం**



వెంకటాపురం(ప్రశ్న న్యూస్ )బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రివర్యులు కల్వకుంట్ల తారక రామారావు పుట్టినరోజు వేడుకలను వెంకటాపురం బిఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణలో శుక్రవారం ఘనంగా



నిర్వహించారు అనంతరం కేటీఆర్ జన్మదినం సందర్భంగా జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి గుండారపు జాహ్నవికి 20వేల రూపాయలను బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప రాంబాబు, జిల్లా నాయకులు గొడవర్తి నరసింహమూర్తి అందజేశారు. చిన్నారి ఆరోగ్యం పై వారి తల్లిదండ్రులు గుండారపు రాజేష్, మమతలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే పార్టీ పెద్దల దృష్టికి తీసుకువెళ్లి, తమ వంతు సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సర్పంచులు ఇర్ప మురళి, ఆదిలక్ష్మి, సీనియర్ నాయకులు వేల్పురి లక్ష్మీనారాయణ, ముదుంబా శ్రీనివాసరావు, గడ్డం వివేక్, రామెల్ల మోహన్ రావు, బట్ట ఏడుకొండలు, బేగ సాంబశివరావు, వెంకటేశ్వర్లు, బట్ట నాగేంద్ర, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీశైల దేవస్థానంలో రానునా శ్రావణమాస ఏర్పాట్లపై ప్రాథమిక సమావేశం ఈవో కీలక ఆదేశాలు





**శ్రీశైలం( ప్రస్నన్యూస్) :** ఆగస్టు 13 నుంచి సెప్టెంబరు 12 వరకునిర్వహించనున్న శ్రావణమాసోత్సవాల ఏర్పాట్లపై ఈఓ యం.శ్రీనివాసరావు గురువారం పరిపాలన కార్యాలయంలో ప్రాథమిక సమావేశం నిర్వహించారు.శ్రావణమాసంలో తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర,ఉత్తరాది రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో అన్ని విభాగాలు ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను హెచారిన్చారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు క్యూలైన్లలోతాగునీరు, అల్పాహారం, బిస్కెట్లు నిరంతరం అందుబాటులో ఉంచాలని సూచించారు. భక్తులరద్దీకి అనుగుణంగా అన్నదానం, లడ్డూ ప్రసాదాల తయారీ, పంపిణీని పెంచడంతో పాటు,అవసరమైతే అదనపు లడ్డూ కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యం, భద్రతా ఏర్పాట్లను మరింత పటిష్టం చేయడంతో పాటు సామూహిక ,వరలక్ష్మీ వ్రతాలు, అఖండ శివనామ భజనల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.ముఖ్యంగా సర్వదర్శనం భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఈవో స్పష్టం చేశారు.

## అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి

# పీజీ వైద్య విద్యార్థిని ఆత్మహత్య

**- చికిత్స పొందుతూ మృతి.. కీసర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు**



కీసర( ప్రశ్న న్యూస్) మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఎంబీబీఎస్ పూర్తి చేసి బెంగుళూరులోని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో పీజీ చదువుతున్న దీక్షిత (26) అపార్ట్‌మెంట్ పై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తీవ్రంగా గాయపడిన ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది.పోలీసుల వివరాల ప్రకారం, గత వారం నాగారం వెస్ట్ గాంధీనగర్‌లో నివసిస్తున్న తన తల్లిదండ్రుల వద్దకు వచ్చిన దీక్షిత, శుక్రవారం సాయంత్రం అపార్ట్‌మెంట్ పై నుంచి దూకింది. వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది.మృతురాలి స్వస్థలం యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మైలారం గ్రామం. ప్రస్తుతం కుటుంబం నాగారంలో నివాసం ఉంటోంది. మృతురాలి తండ్రి ఆనంద్ ఫిర్యాదు మేరకు కీసర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఉపవాస దీక్షతో శారీరక, మానసిక శుద్ధి, ఆధ్యాత్మిక వికాసం





**రవికుమార్ సంతోజు**
**బడంగ్ పేట్**

హిందూ పురాణాల ప్రకారం ఆషాఢ మాసంలో వచ్చే ఏకాదశి ప్రత్యేక విశిష్టత సంతరించుకుంది. ఈరోజును తొలి ఏకాదశి లేదా దేవశయని ఏకాదశి అని పిలుస్తారు. సనాతన ధర్మంలో అత్యంత ప్రాముఖ్యత ఉన్న తొలి ఏకాదశి రోజు నుండి విష్ణువు భగవానుడు యోగనిద్రలోకి ఉపక్రమిస్తాడు. అంతేకాదు, తొలి ఏకాదశి రోజు నుండే హిందువుల పండగలు ప్రారంభమవుతున్నాయి.

### చాతుర్మాస్య వ్రత ప్రారంభం

తొలి ఏకాదశి రోజు నుండే చాతుర్మాస్య వ్రతం ప్రారంభం అవుతుంది. నాలుగు నెలల పాటు సాధువులు, సన్యాసులు, గృహస్థులు ఈ వ్రత నియమాలను పాటిస్తారు. ముఖ్యంగా వ్రత నియమాలలో ఒకే చోట నివసించడం, కొన్ని రకాల ఆహార పదార్థాలు తినకపోవడం, అనుక్షణం ఆధ్యాత్మిక చింతనలో గడపడం ప్రధానమైనవి. వర్షాకాలం ప్రారంభంలో వచ్చే ఈ చాతుర్మాస్య వ్రతం శారీరక, మానసిక శుద్ధికి, ఆధ్యాత్మిక వికాసానికి ఎంతగానో తోడ్పడుతుంది.

### - ఆధ్యాత్మిక ప్రాముఖ్యత

### పాప నిర్మూలన

తొలి ఏకాదశి రోజున ఉపవాసం ఉండి, విష్ణుమూర్తిని పూజించడం వల్ల సకల పాపాలు తొలగిపోయి, కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢమైన విశ్వాసం. ఏడాదిలో వచ్చే 24 ఏకాదశులలో ప్రతి నెలలో 2 ఏకాదశులు వస్తాయి తొలి ఏకాదశికి అత్యంత ప్రాముఖ్యత ఉంది. ఈ ఒక్క ఏకాదశి రోజున దీక్ష చేస్తే కోటి పుణ్యాలు లభిస్తాయని ప్రగాఢ విశ్వాసం.

### జ్ఞానేంద్రియాలపై నియంత్రణ:

ఏకాదశి అంటే 11 అని అర్థం. మన ఐదు జ్ఞానేంద్రియాలు కళ్ళు, చెవులు, ముక్కు, నాలుక, చర్మం ఐదు కర్మేంద్రియాలు వాక్కు, చేతులు, కాళ్లు, మలవిసర్జన, జననేంద్రియాలు, మనసు – ఈ పదకొండింటిని ఏకముఖంగా భగవంతునిపై కేంద్రీకరించే సమయమే ఏకాదశి. ఈ రోజు చేసే ఉపవాసం, పూజ మనసును నియంత్రించి, ఆధ్యాత్మిక ప్రగతికి దోహదపడుతుంది.

### పుణ్యఫలం

ఈ తొలి ఏకాదశి రోజున ఉపవాసం, జపం, ధ్యానం, దానం వంటి వాటితో అపరిమితమైన పుణ్యఫలం లభిస్తుందని పురాణాలు పేర్కొంటున్నాయి

### ఆరోగ్యపరమైన ప్రాముఖ్యత (పేలాల పండుగ)

తొలి ఏకాదశిని పేలాల పండుగ అని కూడా అంటారు. ఈ రోజున పేలాల పిండిని తినడం ఒక ఆచారంగా ఉంది. దీనికి ఒక శాస్త్రీయ కారణం ఉంది. వేసవికాలం ముగిసి వర్షాకాలం ప్రారంభమయ్యే ఈ సమయంలో వాతావరణంలో పెను మార్పులు వస్తాయి. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి, తేమ పెరుగుతుంది. ఈ పరిస్థితుల్లో శరీరంలో జీర్ణక్రియ మందగించడం, జ్వరం, జలుబు వంటి అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉంటుంది. అయితే పేలాల పిండిలో ఉండే కార్బోహైడ్రేట్లు, ఇతర పోషకాలు శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. ఇది శరీరాన్ని వెచ్చగా ఉంచి, రోగనిరోధక శక్తిని పెంచుతుంది. పేలాలు సులభంగా జీర్ణమవ్వడంతో ఉపవాసం తరువాత దీనిని ప్రసాదంగా స్వీకరించవచ్చు.

### పితృదేవతల ఆశీస్సులు

పేలాలను పితృదేవతలకు అత్యంత ఇష్టమైనవిగా భావిస్తారు. ఈ రోజున పితృదేవతలను స్మరించుకుంటు పేలాల పిండిని తీసుకోవడంతో వారి ఆశీస్సులు లభిస్తాయని నమ్మకం. అలాగే రైతులు తమ పొలాల్లో కూడా పేలాల పిండిని చల్లితే వర్షాలు బాగా కురిసి, పంటలు సమృద్ధిగా పండుతాయని విశ్వసిస్తారు.

### దక్షిణాయనం ప్రారంభం

తొలి ఏకాదశి రోజు నుండే దక్షిణాయనం ప్రారంభ సూచనలు కనిపిస్తాయి. క్రమంగా సూర్యుడు దక్షిణ దిశకు వాలుతున్నట్లు కనిపిస్తాడు.ఈ కాలాన్ని దేవతలు రాత్రి సమయంగా భావిస్తారు.

### పురాణ కథ:

ముచి అనే రాక్షసుడు భూమిని పీడిస్తున్నప్పుడు దేవతలు శ్రీమహావిష్ణువుని శరణు వేడగా, విష్ణువుతో పాటు పద్మా ఏకాదశి అనే దివ్యశక్తి ఆ రాక్షసుడిని సంహరించిందని పురాణ కథ. శ్రీహరి యోగనిద్రలోకి వెళ్ళిన రోజునే ఈ సంఘటన జరిగిందని అందుకే దీనిని పద్మా ఏకాదశి అని కూడా అంటారు. ఈ తొలి ఏకాదశి కేవలం ఒక పండుగ మాత్రమే కాదు భక్తికి, ఆత్మశుద్ధికి, ప్రకృతితో మమేకమై జీవించడానికి ప్రతీక. ఈ రోజున నియమబద్ధమైన జీవితాన్ని ప్రారంభించి, భగవద్భక్తిని పెంచుకోవడానికి ఒక గొప్ప అవకాశం లభిస్తుంది.

# తొలి ఏకాదశి మహిమా

**- "హరివాసరపు పవిత్ర వేళ... భక్తికి ద్వారమైన తొలి ఏకాదశి"**

**- ఆషాఢ శుక్ల ఏకాదశి... తెలుగు ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పవిత్ర పర్వదినం.**

**(వెంకట్-- ప్రశ్న న్యూస్ ఏపీ బ్యూరో)**



ఈ ఏకాదశినే "తొలి ఏకాదశి", "దేవశయని ఏకాదశి", "శయన ఏకాదశి", "పద్మ ఏకాదశి" అని పిలుస్తారు. చాతుర్మాస్యానికి నాంది పలికే ఈ రోజు వైష్ణవ సంప్రదాయంలో అత్యంత విశిష్టమైనది. సంవత్సరంలో వచ్చే ఇరవై నాలుగు ఏకాదశులలో తొలి ఏకాదశికి ప్రత్యేక స్థానం ఉంది. భక్తి, నియమం, ఉపవాసం, ఆత్మశుద్ధి, విష్ణుస్మరణకు ప్రతీకగా నిలిచే ఈ పర్వదినం లక్షలాది మంది భక్తులకు ఆధ్యాత్మికోత్సవంగా మారుతుంది. తొలి ఏకాదశి అనేది కేవలం ఒక తిథి కాదు. మనిషిలోని చెడు ఆలోచనలను దూరం చేసి, సత్యం, ధర్మం, దైవభక్తి వైపు నడిపించే ఆధ్యాత్మిక మార్గం. ఈ రోజు ఉపవాసం చేసి శ్రీమహావిష్ణువును భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే పాపాలు నశించి, మోక్షప్రాప్తి కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి.

### తొలి ఏకాదశి అంటే ఏమిటి?

హిందూ చాంద్రమాన పంచాంగం ప్రకారం ఆషాఢ మాసంలోని శుక్లపక్ష ఏకాదశిని తొలి ఏకాదశిగా పరిగణిస్తారు. ఈ రోజు నుంచి శ్రీమహావిష్ణువు క్షీరసాగరంలో ఆదిశేషునిపై యోగనిద్రలోకి ప్రవేశిస్తాడని విశ్వాసం. అందుకే దీనిని దేవశయని ఏకాదశి అంటారు.ఈ రోజు ప్రారంభమయ్యే నాలుగు నెలల కాలాన్నే చాతుర్మాస్యం అంటారు. కార్తీక శుక్ల ఏకాదశి నాడు విష్ణుమూర్తి యోగనిద్ర నుంచి మేల్కొంటాడని, ఆ రోజును ప్రబోధిని ఏకాదశిగా జరుపుకుంటారు.

### పురాణాల్లో తొలి ఏకాదశి చరిత్ర

పద్మపురాణం, స్కాందపురాణం, భవిష్యపురాణం వంటి అనేక పురాణాల్లో తొలి ఏకాదశి మహిమను గొప్పగా వర్ణించారు.పురాణ కథనం ప్రకారం ఒకసారి దేవతలు, ఋషులు శ్రీమహావిష్ణువును దర్శించి, "భూలోకంలో ధర్మం తగ్గిపోతోంది. ప్రజలు పాపాలకు బానిసలవుతున్నారు. వారికి మోక్షానికి సులభమైన మార్గాన్ని చూపించండి" అని ప్రార్థించారు.అప్పుడు శ్రీహరి తన దివ్యశక్తి నుంచి ఒక పవిత్ర దేవతను సృష్టించాడు. ఆ దేవత ఏకాదశి తిథిన అవతరించింది. ఆమె ప్రభావంతో పాపాలన్నీ నశించాయి. అప్పటి నుంచి ఏకాదశి ఉపవాసం చేసిన వారికి పుణ్యం, పాప విముక్తి లభిస్తుందని పురాణాలు పేర్కొంటాయి.మరో కథనం ప్రకారం మూరాసురుడు అనే రాక్షసుడిని సంహరించిన అనంతరం శ్రీమహావిష్ణువు విశ్రాంతి తీసుకున్న రోజు ఇదేనని చెబుతారు. అందుకే ఈ రోజును మహాపవిత్రమైన హరివాసరంగా భావిస్తారు.

### శ్రీమహావిష్ణువు విశిష్టత

సృష్టిని కాపాడే త్రిమూర్తులలో శ్రీమహావిష్ణువు పరిరక్షకుడు. ధర్మానికి ప్రమాదం వచ్చిన ప్రతిసారీ వివిధ అవతారాలు ధరించి లోకక్షేమం కోసం అవతరిస్తాడు.మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ, వామన, పరశురామ, శ్రీరామ, శ్రీకృష్ణ, బుద్ధ అవతారాల ద్వారా ధర్మాన్ని స్థాపించాడు. భవిష్యత్తులో కల్కి అవతారంగా అవతరించి అధర్మాన్ని అంతం చేస్తాడని పురాణాలు చెబుతున్నాయి.

భక్తుని హృదయంలో నివసించే దేవుడు విష్ణుమూర్తి. భక్తుడు ఒక్కసారి "ఓం నమో నారాయణాయ" అని స్మరించినా ఆయన కరుణ లభిస్తుందని వైష్ణవ గ్రంథాలు పేర్కొంటాయి.

### ఎందుకు ఉపవాసం చేస్తారు?

తొలి ఏకాదశి రోజు ఉపవాసం వెనుక కేవలం ఆచారం మాత్రమే కాదు, ఆరోగ్య శాస్త్రం కూడా దాగి ఉంది.ఉపవాసం వల్ల శరీరానికి విశ్రాంతి లభిస్తుంది. మనస్సు ప్రశాంతంగా మారుతుంది. ఇంద్రియ నిగ్రహం అలవడుతుంది. భగవన్నామస్మరణపై దృష్టి కేంద్రీకృతమవుతుంది.భక్తులు రోజు మొత్తం ధాన్యాహారం తీసుకోకుండా పండ్లు, పాలు లేదా తులసీజలంతో ఉపవాసం పాటిస్తారు. కొందరు పూర్తిగా నిర్జల ఉపవాసం కూడా ఉంటారు.

### తొలి ఏకాదశి రోజు భక్తులు ఎలా ఆరాధిస్తారు?

ఉషోదయాన్నే స్నానమాచరించి పరిశుభ్రమైన వస్త్రాలు ధరించి శ్రీమహావిష్ణువు ఆలయానికి వెళ్తారు. ఇంట్లో విష్ణుమూర్తి చిత్రపటం లేదా విగ్రహాన్ని అలంకరించి తులసి దళాలు, పూలతో పూజ నిర్వహిస్తారు. "ఓం నమో నారాయణాయ", "విష్ణు సహస్రనామం", "గోవింద నామస్మరణ", "శ్రీమద్భగవద్గీత" పారాయణం చేస్తారు. తులసి దళం లేకుండా విష్ణుపూజ పూర్తికాదని భావిస్తారు. అందుకే ప్రతి నైవేద్యంలో తులసి దళాన్ని సమర్పిస్తారు. సాయంత్రం దీపారాధన చేసి భజనలు, హరినామ సంకీర్తనలు నిర్వహిస్తారు. రాత్రంతా జాగరణ చేసి శ్రీహరిని స్మరిస్తే అనేక జన్మల పాపాలు తొలగిపోతాయని విశ్వాసం.

### పెద్దలు ఎలా జరుపుకుంటారు?

గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ పెద్దలు ఉదయం నుంచే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. విష్ణు సహస్రనామ పారాయణం, సత్యనారాయణ వ్రతం, అన్నదానాలు నిర్వహిస్తారు. కొన్ని ప్రాంతాల్లో తులసి మొక్కకు ప్రత్యేక పూజ చేసి దీపాలు వెలిగిస్తారు. చాతుర్మాస్య వ్రతాలను కూడా ఈ రోజే ప్రారంభిస్తారు.

### పిల్లలకు నేర్పే విలువలు

తొలి ఏకాదశి సందర్భంగా పెద్దలు పిల్లలకు పురాణ కథలు చెబుతారు.శ్రీకృష్ణుడు, ప్రహ్లాదుడు, ధ్రువుడు వంటి మహాభక్తుల కథల ద్వారా భక్తి, నిజాయితీ, ధర్మం, పెద్దల పట్ల గౌరవం వంటి విలువలను నేర్పుతారు.పిల్లలతో కలిసి గోవింద నామస్మరణ చేయిస్తారు. దేవాలయ దర్శనం చేయించి, దానం చేయడం గొప్పతనాన్ని తెలియజేస్తారు.

### తులసి మహిమ

విష్ణుమూర్తికి అత్యంత ప్రీతిపాత్రమైనది తులసి.తులసి దళం సమర్పిస్తే కోట్ల పుష్పాలు సమర్పించిన ఫలితం లభిస్తుందని పురాణాలు పేర్కొంటాయి.తులసి చుట్టూ ప్రదక్షిణలు చేయడం, తులసి తీర్థం సేవించడం ఆరోగ్యపరంగానూ, ఆధ్యాత్మికంగానూ శ్రేయస్కరమని పెద్దలు చెబుతారు.దేవాలయాల్లో ప్రత్యేక ఉత్సవాలు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, శ్రీరంగం, యాదాద్రి, అన్నవరం, ద్వారకా తిరుమల, మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాలు, సింహాచలం తదితర వైష్ణవ క్షేత్రాల్లో తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఉత్సవాలు, భజనలు, హరినామ సంకీర్తనలు నిర్వహిస్తారు.అనేక ప్రాంతాల్లో రాత్రంతా భక్తి సంగీత కార్యక్రమాలు జరుగుతాయి.

### చాతుర్మాస్య ప్రాముఖ్యత

తొలి ఏకాదశితో ప్రారంభమయ్యే నాలుగు నెలలను అత్యంత పవిత్ర కాలంగా భావిస్తారు.ఈ సమయంలో సాధువులు ఒకే ప్రాంతంలో నివసిస్తూ ధర్మప్రచారం చేస్తారు.భక్తులు మాంసాహారం, మద్యపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉండి భక్తి మార్గంలో నడుస్తారు.

### ఏకాదశి సందేశం

తొలి ఏకాదశి మనిషికి ఇచ్చే గొప్ప సందేశం -- "శరీరాన్ని శుద్ధి చేసుకోవడం కంటే మనస్సును శుద్ధి చేసుకోవడం గొప్పది." ఉపవాసం అంటే కేవలం ఆకలితో ఉండటం కాదు. చెడు మాటలు, చెడు ఆలోచనలు, కోపం, అసూయ, అహంకారం వంటి దుర్గుణాలను విడిచిపెట్టడం కూడా నిజమైన ఉపవాసమే.దైవభక్తితో పాటు మానవసేవ చేయాలని ఈ పర్వదినం గుర్తు చేస్తుంది.

### ఎప్పుడు వస్తుంది?

తొలి ఏకాదశి ప్రతి సంవత్సరం ఆషాఢ మాసం శుక్లపక్ష ఏకాదశి రోజున వస్తుంది. గ్రెగోరియన్ క్యాలెండర్ ప్రకారం సాధారణంగా జూలై నెలలో ఎక్కువగా వస్తుంది. ప్రతి సంవత్సరం పంచాంగాన్ని బట్టి తేదీ మారుతుంది.

### ఆధ్యాత్మిక జీవనానికి ఆహ్వానం

నేటి వేగవంతమైన జీవితంలో మనిషి యాంత్రికంగా మారిపోతున్నాడు. ప్రశాంతత, ఓర్పు, దయ, ప్రేమ వంటి విలువలు క్రమంగా తగ్గుతున్నాయి. అలాంటి సమయంలో తొలి ఏకాదశి మనకు ఆత్మపరిశీలనకు అవకాశం కల్పిస్తుంది.ఈ రోజు కొద్దిసేపైనా భగవంతుని ధ్యానించడం, కుటుంబ సభ్యులతో కలిసి ప్రార్థించడం, అవసరమైన వారికి అన్నదానం చేయడం, ప్రకృతిని ప్రేమించడం, తులసి మొక్కను నాటడం వంటి మంచి పనులు చేయడం ద్వారా ఈ పర్వదినం సార్థకమవుతుంది.తొలి ఏకాదశి అనేది కేవలం పంచాంగంలోని ఒక తిథి కాదు. అది భక్తి, నియమం, ధర్మం, ఆత్మశుద్ధి, మానవత్వం కలిసిన మహోన్నత ఆధ్యాత్మిక సంస్కృతి. శ్రీమహావిష్ణువు యోగనిద్రలోకి ప్రవేశించే ఈ పవిత్ర దినం ప్రతి భక్తుడి జీవితంలో ఆత్మవిశ్వాసాన్ని, ప్రశాంతతను, సత్సంకల్పాలను నింపుతుంది.ఉపవాసం శరీరానికి నియమాన్ని నేర్పితే, విష్ణుస్మరణ మనసుకు ప్రశాంతతను అందిస్తుంది. తులసి దళంతో చేసే చిన్న పూజ కూడా భక్తితో చేసినప్పుడు మహాయజ్ఞానికి సమానమని మన సంప్రదాయం చెబుతుంది. అందుకే పెద్దలు "ఏకాదశి ఉపవాసం -- జన్మకు ఉపకారం" అని చెప్పేవారు.ఈ తొలి ఏకాదశి సందర్భంగా ప్రతి ఇంటా గోవింద నామస్మరణ మారుమోగాలి. ప్రతి హృదయంలో ధర్మం వికసించాలి. ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యం, ఆరోగ్యం, ఆనందం నెలకొనాలని శ్రీమహావిష్ణువును ప్రార్థిస్తూ..."ఓం నమో నారాయణాయ" -- ఈ మహామంత్రం ప్రతి హృదయంలో నిత్యం నినదించుగాక!

# తొలి ఏకాదశి విశిష్టత..

## శ్రీహరి యోగనిద్ర, చాతుర్మాస దీక్షలు,

ఆషాఢ శుక్ల ఏకాదశిగా జరుపుకునే దేవశయని ఏకాదశి ఈ ఏడాది జూలై 25న వస్తోంది. ఈ రోజున శ్రీమహావిష్ణువు యోగనిద్రలోకి ప్రవేశిస్తాడనే విశ్వాసంతో చాతుర్మాసం ప్రారంభమవుతుంది. ఈ కాలంలో వివాహాలు, గృహప్రవేశాలు వంటి శుభకార్యాలను సాధారణంగా నిర్వహించరు. హిందూ సంప్రదాయంలో అత్యంత విశిష్టమైన పర్వదినాల్లో దేవశయని ఏకాదశి ఒకటి. ఆషాఢ మాసంలో వచ్చే శుక్ల పక్ష ఏకాదశిని తొలి ఏకాదశి లేదా దేవశయని ఏకాదశిగా పిలుస్తారు. ఈ పవిత్ర దినాన శ్రీ మహావిష్ణువు క్షీరసాగరంలో యోగ నిద్రలోకి వెళ్తాడని శాస్త్రాలు చెబుతున్నాయి.కార్తిక మాసంలో దేవోత్థాన ఏకాదశి వచ్చే వరకు ఆయన పాతాళ లోకంలోనే నివసిస్తారనే నమ్మకం ఉంది. విష్ణుమూర్తి యోగ నిద్రలోకి వెళ్లడంతో ఈ నాలుగు నెలల పాటు అంటే కార్తిక మాసం వరకు సృష్టి పాలనా బాధ్యతలు పరమశివుడి చేతిలోకి వెళ్తాయని పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఏడాది దేవశయని ఏకాదశి జూలై 25న వస్తోంది. ఈ ప్రత్యేక రోజుతోనే హిందూ కేలండర్‌లో చాతుర్మాస దీక్షలు అధికారికంగా ప్రారంభమవుతాయి.

### అద్భుత గ్రహాల కలయిక.. ఈ సమయంలో నిషిద్ధమైన పనులు

ఈ ఏడాది దేవశయని ఏకాదశి నాడు ఆకాశంలో అరుదైన గ్రహాల కలయిక ఏర్పడుతోంది. జ్యోతిష్య నిపుణుల అంచనాల ప్రకారం, గురు గ్రహం కర్కాటక రాశిలో ఉచ్ఛ స్థితిలో ఉండగా, సూర్యుడు కూడా అదే కర్కాటక రాశిలో సంచరిస్తున్నాడు. మరోవైపు రాహువు కుంభ రాశిలో, శని మీన రాశిలో, శుక్రుడు-కేతువులు సింహ రాశిలో ఉన్నాయి.బుధుడు తన స్వరాశి అయిన మిధున రాశిలో కొలువుదీరాడు. అయితే, ప్రస్తుతం గురుడు అస్తమించి ఉండటం వల్ల వివాహం వంటి మంగళకరమైన కార్యక్రమాలకు ముహుర్తాలు ఉండవు. ఈ చాతుర్మాస కాలం ముగిసి, కార్తిక మాసంలో వచ్చే దేవోత్థాన ఏకాదశి నాడే మళ్లీ గృహప్రవేశాలు, పెళ్లిళ్లు వంటి శుభకార్యాలు ప్రారంభమవుతాయి. అప్పటి వరకు మరో నాలుగు నెలల పాటు శుభకార్యాలకు విరామం తప్పదు.

### దేవశయని ఏకాదశి ప్రాముఖ్యత..

**ఆచరించాల్సిన నియమాలు:** సమస్త పాపాలను హరించి, మోక్షాన్ని ప్రసాదించే దివ్యమైన వ్రతంగా ఈ ఏకాదశికి ప్రత్యేక స్థానం ఉంది. ఈ పర్వదినాన శంఖు, చక్ర, గదాధరుడైన శ్రీమహావిష్ణువును భక్తిశ్రద్ధలతో పూజించాలి. నిష్టతో ఏకాదశి వ్రతం ఆచరించి, దీపారాధన చేసి, ప్లాశ్ ఆకుల్లో భోజనం చేయడం, రాత్రి సమయంలో నేలపై పడుకోవడం వంటి ఆచారాలను పెద్దలు పాటిస్తుంటారు. అలాగే, చాతుర్మాస



నియమాలలో భాగంగా శ్రావణ మాసంలో ఆకుకూరలు, భాద్రపద మాసంలో పెరుగును పరిమితంగా తీసుకోవాలని చెబుతారు. ఈ నాలుగు నెలల కాలంలో బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ, భగవన్నామ స్మరణలో గడిపితే శ్రీహరి కటాక్షం సంపూర్ణంగా లభిస్తుందని నమ్ముతారు.

### రాజా బలి వద్ద శ్రీహరి నివాసం

పురాణాల ప్రకారం, ఈ ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువు ఒక రూపంలో రాజా బలి వద్ద ఉండగా, మరో రూపంలో క్షీరసాగరులో ఆదిశేషుడి పాన్పుపై శోభిస్తాడు. కార్తీక ఏకాదశి వరకు ఈ నిద్ర కొనసాగుతుంది.

ఈ నాలుగు నెలల సమయాన్ని కేవలం భగవత్ చింతనకు, జప తపాలకు కేటాయించాలని ఆధ్యాత్మిక గురువులు సూచిస్తున్నారు. ఈ కాలంలో కనీసం ఒక్క పూట భోజనం చేస్తూ నియమబద్ధంగా జీవిస్తే విశేషమైన పుణ్యఫలం దక్కుతుంది.

# మొక్కలు నాటుదాం - మనవి చేద్దాం

## తెలంగాణ వైద్యవిధాన పరిషత్ లో విన్నూత్న రీతిలో నిరసన కార్యక్రమాలు

- రెండు నెలలుగా భర్తీకాని కమీషనర్ పోస్టు
- కమీషనర్ పోస్టు ఖాళీగా ఉండడంతో రోజు రోజుకు పేరుకు పోతున్న సమస్యలు
- తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం.
- వెంటనే కమీషనర్ ను నియమించి సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలి.





మలక్ పేట్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కు (డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్) గత రెండు నెలలుగా కమీషనర్ పోస్టు ఖాళీగా ఉండడంతో తమ సమస్యలను వినిపించి పరిష్కారించుకునే అవకాశం లేదని తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఉద్యోగుల జేఏసి నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. టివివిపి జేఏసి పిలుపుమేరకు శుక్రవారంనాడు మలక్ పేట్ ఏరియా ఆస్పత్రిలో మొక్కలు నాటుదాం - మనవి చేద్దాం అని విన్నూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో పాల్గోన్న వైద్యులు సిబ్బంది మొక్కలు నాటి రెగ్యులర్ కమీషనర్ ను నియమించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతు వివిధ స్థాయిలో పని చేస్తున్న185 ఆస్పత్రుల్లోతో 4000 మంది సిబ్బందితో ప్రభుత్వ వైద్య సేవలలో అతి కీలకమైన పాత్ర పోషిస్తు, డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ గా మారబోతున్న వైద్య విధాన పరిషత్ కమిషనర్ పదవీ విరమణ చేసి రెండు నెలలు గడుస్తున్నప్పటికీ ఇంత వరకు రెగ్యులర్ కమిషనర్ ను నియమించక పోవడంతో ఈ విభాగంలోని వైద్యశాలల్లో పనితీరు పూర్తిగా దిగజారిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. సరైన పర్యవేక్షణ కొరవడడం తో పాటు వైద్యులు, నర్సింగ్, పారామెడికల్, మినిస్టీరియల్ సిబ్బంది, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పెరుకుపోవడంతో సిబ్బంది వ్యక్తిగత, సర్వీస్ పరమైన సమస్యలు పరిష్కారానికి నోచుకోక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ విషయమై ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడంతో వైద్య విధాన పరిషత్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వైద్య విధాన పరిషత్ హాస్పిటల్స్ లో "మొక్కలు నాటుదాం - మనవి చేద్దాం" అంటు ఒక వినూత్న కార్యక్రమంతో ప్రభుత్వానికి తమ నిరసన తెలపాల్సి వచ్చింది తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు, మా సమస్యల పరిష్కారానికి కమిషనర్ నియామకం అవసరం అంటులో వైద్యులు , సిబ్బంది కలిసి మొక్కలు నాటారు.ఇకనైనా తమ ఆవేదన అర్థం చేసుకుని వెంటనే రెగ్యులర్ కమిషనర్ ను నియమించాలని కోరారు. అత్యవసర వైద్య సేవలు అందించే శాఖలో పనిచేస్తున్నందున వీధులోకి వచ్చి ఉద్యమాలు చేసి ప్రజలకు అసౌకర్యం కలిగించలేక ఇటువంటి సున్నితమైన చర్యల ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని,అనివార్యమైన పరిస్థితిలో తాము ఉద్యమాలు తీవ్రతరం చేయక ముందే ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి.వి.వి.పి.జె.ఏ.సీ నాయకులు పరాబ్ కుమార్, పాండు, ఏరియా హాస్పిటల్ సిబ్బంది నళిని, రమణేశ్వరి, రాధా, స్వర్ణలత, అన్నపూర్ణ , భాగ్యమ్మ, విజయ రాణి,జగన్,కిరణ్, పప్పురాజ, నాగరాజు, మాధవి, వైష్ణవి, అంబరీష్ నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

### కమ్యూనిటీ హాస్పిటల్ ఖైరతాబాద్ లో

టి.వి.వి.పి జే.ఏ.సీ పిలుపు మేరకు శుక్రవారంనాడు ఖైరతాబాద్ కమ్యూనిటీ హాల్ లో నిర్వహించిన మొక్కలు నాటుదాం - మనవి చేద్దాం అనే విన్నూత్న కార్యక్రమంలో పాల్గోని తమ నిరసన వ్యక్తం చేస్తు వెంటనే తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కు నూతన కమీషనర్ ను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీరేశ్ కళ్యాణం, శైలజ, అల్తాఫ్ అలీ, ఆఫీసు సిబ్బంది కృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గోన్నారు.

# కుబేర సమాజంలో మానవత్వపు వెలుగు

- గిర్మాపూర్ గ్రామం స్ఫూర్తి కథనం
- సంపద ప్రపంచంలో అభాగ్యుల ఆవేదన
- నిస్సహాయులకు అండగా నిలిస్తున్న గిర్మాపూర్ గ్రామస్తుల హృదయం
- డబ్బు ప్రపంచంలో అనాథల, నిరుపేదల ఆవేదన

**సృష్టిలో సంపదకు అధిపతి కుబేరుడు కావచ్చు, కానీ ఈ ఆధునిక సమాజంలో బతకడానికి కనీస గుర్తింపు కూడా నోచుకోని నిరుపేదలు, అనాథల పరిస్థితి ఎల్లప్పుడూ ప్రశ్నార్థకమే. టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల తెరకెక్కించిన 'కుబేర' సినిమాలో కనిపించే నిరుపేద, అనాథ పాత్రలు కేవలం కల్పితాలు కావు. అవి ఈ సమాజంలో అట్టడుగున బతుకుతున్న ఎంతోమంది అభాగ్యుల నిజ జీవిత ప్రతిబింబాలు. డబ్బు, అధికారం, ఆస్తుల చుట్టూ తిరిగే ప్రపంచంలో కనీసం అడ్రస్ లేని వారి జీవితాలు ఎంత దయనీయంగా మారుతుంటాయో మనం నిత్యం చూస్తూనే ఉంటాం. ఒకవైపు ఆకాశాన్ని తాకే హంగులు, అంతులేని సంపద, మరోవైపు కడుపు నింపుకోవడానికి రోడ్డుపై పడే తపన ఈ రెండింటి మధ్య నలిగే బతుకులే అసలు విషాదం.**

మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) పుట్టుకతో లేదా పరిస్థితులరీత్యా ఆశ్రయం లేక, సమాజంలో ఏ మూలన పడినా పట్టించుకునే నాథుడు లేని నిరుపేద కుటుంబాలు కేవలం పెద్దల స్వార్థ రాజకీయాలకు, ఆర్థిక ఇబ్బందులకు బలిపశువులు అవుతున్న వైనం హృదయాలను కలచివేస్తుంది. సుమారు 30 సంవత్సరాల క్రితం గిర్మాపూర్ గ్రామానికి వలస వచ్చి, దైనందిన కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మొగిలి నర్సమ్మ కుటుంబం సరిగ్గా అలాంటి కఠిన వాస్తవాలనే ఎదుర్కొంది. గత నెలలో చిన్న కుమారుడు అనారోగ్యంతో మరణిస్తే గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అంత్యక్రియలు జరిపించారు. ఆ విషాదం నుంచి కోలుకోకముందే కుటుంబ పెద్ద అయిన నర్సమ్మ కూడా మరణించడంతో ఆ కుటుంబం పూర్తిగా కుదేలైంది. చేతిలో చిల్లిగవ్వ లేని ఆ నిరుపేద పరిస్థితిని చూసి ప్రపంచాన్ని శాసించే కుబేరుల దర్పం ముందు ఈ అభాగ్యుల కన్నీళ్లు మూగబోయిన ఆర్తనాదాలుగానే మిగిలిపోతాయా అనే ప్రశ్న ఉద్భవిస్తుంది.

### కులాలు, మతాలకు అతీతంగా కదిలిన గిర్మాపూర్ హృదయాలు

అయితే, సినిమాలోని విషాద ముగింపులకు భిన్నంగా, నిజ జీవితంలో మానవత్వం ఇంకా బతికే ఉందనే నిజాన్ని గిర్మాపూర్ గ్రామ ప్రజలు మరియు గిర్మాపూర్ హిందూ దళం సభ్యులు చేతల్లో నిరూపించారు. కుటుంబ పెద్ద మరణంతో అంత్యక్రియలకు కూడా డబ్బు లేని ఆపద సమయంలో, గ్రామ పెద్దలు, యువకులు, హిందూ దళం సభ్యులు అందరూ



ఒక్కటయ్యారు. రాజకీయాలు, కులాలు, మతాలను పక్కనపెట్టి స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి రూ.36 వేల నిధిని తక్షణ ఆర్థిక సహాయంగా ఆ కుటుంబానికి అందజేశారు.

### సాంకేతికత చాటిన సామాజిక స్పృహ -- మనిషికి మనిషే తోడు

"వాట్సాప్ గ్రూప్ అంటే కేవలం ఫోటోలు పంచుకునే వేదిక కాదు, ఆపదలో అండగా నిలబడే సాధనం" అని నిరూపిస్తూ వారు "మనిషికి మనిషే తోడు" అనే మహోన్నత విలువలను చాటుకున్నారు. సంపద మనిషి స్థాయిని పెంచవచ్చు కానీ, తోటి మనిషిని ఆదరించే గుండె లేకపోతే ఏ సామ్రాజ్యానికి అర్థం ఉండదు అనే సత్యాన్ని ఈ సంఘటన మనకు నేర్పుతుంది.

## కామధేను పౌండేషన్ ఆధ్వర్యంలో యంఎన్‌జే ఆస్పత్రికి 1.5 లక్షల విలువైన ఫర్నిచర్ విరాళం



నాంపల్లి (ప్రశ్న న్యూస్) మానవ సేవే మాధవసేవ అనే నానుడిని నిజం చేస్తు కామధేను ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నాడు యం.ఎన్.జే క్యాన్సర్ హాస్పిటల్ పిల్లల వార్డులో అవసరమయ్యే లక్ష యాభై వేల రూపాయల విలువైన టేబుల్స్, కుర్చీలు, బ్లడ్ శాంపిల్స్ సేకరించేందుకు ఉపయోగించే ఫర్నిచర్ మెటీరియల్ ను విరాళంగా అందివ్వడం హర్షణీయం. ఈ సందర్భంగా యం.ఎన్.జే క్యాన్సర్ ఆస్పత్రిలో బుధవారం నాడు జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గోన్న తెలంగాణ హర్టికల్చర్ శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, ఐఏఎస్, మాట్లాడుతున్న క్యాన్సర్ మహమ్మారి బారిన పడకుండా ఉండేందుకు ప్రజలు తమ జీవనశైలిని మార్చుకోవాల్సిన అవసరం ఉందని, మంచి అలవాట్లను పాటిస్తు వ్యాయామం, యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత పొందడంతో సంపూర్ణమైన ఆరోగ్యం చేకూరుతుందని సూచించారు. అలాగె ప్రతి ఒక్కరు విధిగా ఒక మొక్కను నాటాలని, ఈ మొక్కలు పెద్దవై మనకు అవసరమయ్యే స్వచ్ఛమైన ప్రాణవాయువు అందిస్తాయని అన్నారు. జిహెచ్‌యంసీ అదనపు కమిషనర్ రఘుప్రసాద్ మాట్లాడుతు గతంతో పోల్చుకుంటే ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో ఒక బలమైన నమ్మకం బలపడిందని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది పనితీరు, ఉద్యోగ భాధ్యతల పట్ల వారిలో ఉన్న అంకుటిత దీక్షతో సర్కార్ ఆస్పత్రుల్లో కార్పోరేట్ చికిత్సలు అందుతున్నాయని తెలిపారు. కామధేనువు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోగుల సౌకర్యార్థం అందిస్తున్న ఫర్నిచర్ తో నిర్వహణ మెరుగుపడి మరింత సౌకర్యవంతంగా మారుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సదాశివుడు మాట్లాడుతు ఆస్పత్రిలో సిబ్బంది బాధ్యతాయుత పనితీరుతో రోగులకు అత్యంత మెరుగైన సేవలు అందుతున్నాయని తెలిపారు. అలాగే ఇక్కడ కీమోథెరపీ, స్కానింగ్, వంటి సేవలు, బోన్ మ్యారో మార్పిడి వంటి అధునాతన చికిత్సలు ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. అలాగే ఇక్కడ చికిత్స పొందుతున్న రోగుల సౌకర్యార్థం ఎన్నో స్వచ్ఛంద సంస్థలు తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయని, ఇప్పటికే ఇక్కడ మంచినీటి కోసం ఆర్వో ప్లాంటు ఏర్పాటుతో ఆస్పత్రిలోని అన్ని వార్డుల్లో నిర్విరామంగా నీటి సరఫరా అందుబాటులో ఉందన్నారు. కామధేను ఫౌండేషన్ ఆధ్వర్యంలో పిల్లల వార్డులో ఆవసరమయ్యే ఫర్నిచర్‌ను అందిచడం హర్షణీయమని ఫౌండేషన్ అధ్యక్షుడు పి. వెంకటేశ్ ను అభినందించి ధన్యవాదాలు తెలిపారు. కామధేను ఫౌండేషన్ అధ్యక్షులు పి. వెంకటేశ్ మాట్లాడుతు తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజాసేవలో భాగంగా తాము చేపట్టే ప్రజోపయోగ కార్యక్రమాలు నిజమైన లబ్ధిదారులకు అందిన నాడే తమ సేవలకు సార్థకత చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కామధేను ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ అరవింద్, ప్రధాన కార్యదర్శి ఉమేష్, సత్యనారాయణ (ఆయిల్ పెడ్) పాథలోజీ విభాగం అధికారి డాక్టర్ రాధిక, డాక్టర్ శిల్పారెడ్డి, డాక్టర్ వెన్నెల, డాక్టర్ జానకీ రాం, డాక్టర్ ఖలీల్, చిల్వేరి నాగరాజు, లక్షీనారాయణ, పద్మావతి, స్వప్న, నరేందర్ రెడ్డి, సత్యం, తదితరులు పాల్గొన్నారు

## మృతుల కుటుంబాలకు

# రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

- హోంగార్డు కుటుంబాల సంక్షేమానికి అండగా ఉంటాం
- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు,



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )** మెదక్ జిల్లాలో ఇటీవల విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన హోంగార్డు ఎం. శివరాం, గుండెపోటుతో మృతిచెందిన హోంగార్డు టీ. మహేందర్ కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కులను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అందజేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మృతుల కుటుంబ సభ్యులకు ఎస్పీ చెక్కులను అందించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఎస్పీ వారి ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మృతుడు శివరాం కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఎస్పీ.. ఆయన పిల్లల చదువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బీటెక్ పూర్తి చేసిన శివరాం కుమారుడు ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్న విషయం తెలుసుకుని, అతని విద్యార్హతలు, ఇతర వివరాలను సేకరించారు. ఉద్యోగం కల్పించే విషయంలో తనవంతు సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే మహేందర్ భార్య ప్రస్తుతం ఎలాంటి ఉపాధి లేక ఇంటివద్దే ఉంటున్న విషయం తెలుసుకున్న ఎస్పీ.. ఆమె విద్యార్హతలు, ఉద్యోగ అవకాశాల గురించి ఆరా తీశారు. ఆమెకు ఉద్యోగం కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎస్పీ తెలిపారు. కుటుంబ సభ్యుల సంక్షేమానికి అవసరమైన సహకారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఆర్ఐ శైలేందర్, ఆర్ఎస్ఐ నరేష్, రైటర్ శ్రావణ్, మృతుల కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్.ఐ.ఆర్ నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలి

### - కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) శు క్రవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఎస్.ఐ.ఆర్ నమోదు పై మెదక్ నియోజకవర్గ స్థాయి తాసిల్దారులు, సూపర్వైజర్లు , బిఎల్ఓ లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారీగా ఎస్.ఐ.ఆర్ నమోదు పైసూపర్వైజర్లు , బి ఎల్ వో లు. క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో పనిచేయాలని వారికి ఇచ్చిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ దాదాపు 97% శాతం వరకు పూర్తయిందని, మిగిలిన మొత్తాన్ని నిర్ణీత గడువు కంటే ముందుగానే పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు.మెదక్ -96 %పాపన్నపేట,- 95% శంకరంపేట- ,100% రామాయంపేట-97 ,% హవేలీ ఘనపూర్,- 98% నిజాంపేట,96% నా ర్సింగ్ - 99 ,%మండలాల్లో శాతం పూర్తికాగా, ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.బీఎల్‌వోల నుంచి ప్రతిరోజూ పురోగతి నివేదికలు సేకరించాలని, ప్రత్యేక నమోదు శిబిరాలు నిర్వహించాలని, బీఎల్ఏలు కౌన్సిలర్లను సమన్వయం చేసుకుంటూ ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని . , పోలింగ్ కేంద్రం వారిగా మ్యాపింగ్ కానీ జాభితా బిఎల్ఏలకు ఇవ్వాలని, వారిని భాగస్వాములను చేయాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్ ఆర్డిఓ రమాదేవి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు . గఫార్ మెదక్ డివిజన్ మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# చదువే శాశ్వత ఆస్తి, ప్రభుత్వ బడులే భవిష్యత్‌కు బాట

- తల్లిదండ్రులు--టీచర్లు చేతులు కలిపితేనే విద్యార్థుల విజయం
- మెగా పీటీఎంలో సీఎం చంద్రబాబు పిలుపు..
- గిరిజనులకు అండగా ఉంటామని భరోసా
- ప్రభుత్వ విద్యపై పెరిగిన విశ్వాసం..
- ప్రైవేటు నుంచి లక్షా పది వేల మంది ప్రభుత్వ బడుల్లోకి





**రంపచోడవరం(ప్రశ్న న్యూస్)** ''పిల్లలకు తల్లిదండ్రులు ఇవ్వగలిగే గొప్ప ఆస్తి చదువు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి పనిచేస్తేనే విద్యార్థుల భవిష్యత్తు బంగారుమయం అవుతుంది. ప్రభుత్వ బడులను దేశంలోనే అత్యుత్తమ విద్యాలయాలుగా తీర్చిదిద్దడమే మా ప్రభుత్వ లక్ష్యం'' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పోలవరం జిల్లా రంపచోడవరంలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్--టీచర్ మీటింగ్లో పాల్గొన్న ఆయన విద్య, సంక్షేమం, గిరిజనాభివృద్ధి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఉపాధి, మాదకద్రవ్యాల నిర్మూలన వంటి పలు అంశాలపై విస్తృతంగా మాట్లాడారు.

### ప్రభుత్వ బడులపై పెరిగిన నమ్మకం

ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు పాఠశాలలకు విద్యార్థులు వెళ్లే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిందని సీఎం అన్నారు. ప్రైవేటు పాఠశాలల నుంచి లక్షా పది వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం ప్రభుత్వ విద్యపై పెరిగిన విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. విద్యార్థుల ఫలితాలు మెరుగుపడాలంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమాన బాధ్యతతో పనిచేయాలని సూచించారు.
లోకేష్‌పై ప్రశంసలువిద్యాశాఖ అత్యంత బాధ్యతాయుతమైన శాఖ అని, మంత్రి నారా లోకేష్ దానిని నిబద్ధతతో నిర్వహిస్తూ ప్రభుత్వ విద్యలో మార్పులకు శ్రీకారం చుట్టారని చంద్రబాబు కొనియాడారు.

ఉపాధ్యాయులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఆధునిక బోధనా పద్ధతులను అనుసరించాలని సూచించారు. బదిలీలను పారదర్శక కౌన్సెలింగ్ ద్వారా నిర్వహిస్తున్నామని చెప్పారు.

### 'తల్లికి వందనం' నుంచి 'సంజీవని' వరకు

రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. 'తల్లికి వందనం' పథకం నిధులు ఇప్పటికే లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యాయని గుర్తుచేశారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం-2.0, సోలార్ విద్యుత్ వంటి సంక్షేమ పథకాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఆగస్టు నుంచి 'సంజీవని' డిజిటల్ హెల్త్ ప్రాజెక్ట్ ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు.

### విద్యార్థులతో కలిసి భోజనం

కార్యక్రమం అనంతరం సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం నాణ్యతను స్వయంగా పరిశీలించి, పోషకాహారం మరింత మెరుగ్గా అందించాలని అధికారులకు సూచించారు. రాగిమాల్ట్, చిక్కీల పంపిణీపై వివరాలు అడిగి తెలుసుకుని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.

### తరగతి గదిలో సీఎంమే టీచర్

పాఠశాల తరగతి గదులను సందర్శించిన చంద్రబాబు విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులు, స్మార్ట్ క్లాస్ బోధనను పరిశీలించారు. కొద్దిసేపు ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు పాఠాలు చెప్పి వారిలో ఉత్సాహం నింపారు. విద్యార్థులు నాటిన మొక్కలను పరిశీలించి గ్రీన్ పాస్‌పోర్టు విధానాన్ని అభినందించారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఫొటోలు దిగుతూ ఆప్యాయంగా ముచ్చటించారు.విద్యా సంస్కరణలు, సంక్షేమ హామీలు, గిరిజనాభివృద్ధి, ఆరోగ్యం, ఉపాధి, మాదకద్రవ్యాల నిర్మూలన.. ఇలా అన్ని అంశాలను స్పృశించిన సీఎం ప్రసంగం రంపచోడవరం మెగా పీటీఎంను రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మార్చింది.

# రక్తంతో లేఖ చూసి చాలా బాధపడ్డాను

**- ఎమ్మెల్యే మల్లారెడ్డి**

**సికింద‌రాబాద్** తనకు బీఆర్ఎస్ కార్యకర్త రక్తంతో రాసిన లేఖపై మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి స్పందించారు. ఆ లేఖ తనను ఎంతో బాధించిందని, ఆ కార్యకర్త ఎవరో కనుక్కొని తప్పకుండా కలుస్తానని తెలిపారు. శుక్రవారం నాడు బోయిన్పల్లిలో జరిగిన కేటీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మల్లారెడ్డి.. తాను ఏ పార్టీలోకీ మారడం లేదని, బీఆర్ఎస్లోనే ఉంటానని మరోసారి స్పష్టం చేశారు.

## కేటీఆర్ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం

**రామడుగు** మండల కేంద్రంలో కేటీఆర్ జన్మదినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వరరావు తదితరులు తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదానం చేసారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# వ్యక్తి హత్య



**బాపట్ల** బాపట్ల జిల్లా చిన్నగంజాం మండలం సంతరావూరు గ్రామంలో ఆతిన శ్రీనివాస్ (58)ను గుర్తుతెలియని వ్యక్తులు కర్రలతో కొట్టి చంపేశారు. సమాచారం అందగానే పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ ప్రారంభించారు. దీనిపై కేసు నమోదు అయింది. ఇంకొల్లు సీఐ ఎం రామా నాయక్ చినగంజం ఎస్సై ఎస్ రమేష్ దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

# సంజీవని'తో డిజిటల్ వైద్య విప్లవం

- రోగి ఎక్కడికి వెళ్లినా.. ఆరోగ్య చరిత్ర వైద్యుడి ముందే
- 10.51 లక్షల మందికి డిజిటల్ హెల్త్ ఖాతాలు.. కర్నూలు ఆస్పరిలో నేడు సీఎం చంద్రబాబు ప్రారంభం



అమరావతి(ప్రశ్న న్యూస్) గ్రామీణ ఆరోగ్య కేంద్రం నుంచి బోధనాస్పత్రి వరకు రోగికి అందే ప్రతి వైద్య సేవను ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకువచ్చే 'ప్రాజెక్టు సంజీవని' రాష్ట్ర ప్రజారోగ్య వ్యవస్థలో కీలక మైలురాయిగా మారుతోంది. రోగి ఏ ఆస్పత్రికి వెళ్లినా అతని ఆరోగ్య చరిత్ర క్షణాల్లో వైద్యుడికి అందుబాటులోకి వచ్చేలా రూపొందించిన ఈ సమగ్ర డిజిటల్ ఆరోగ్య వ్యవస్థను శనివారం కర్నూలు జిల్లా ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు.ఈ విషయాన్ని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం వెల్లడించారు. రాష్ట్రంలో సంజీవని కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు సాధించిన పురోగతిని వివరించారు.

### ప్రతి ఒక్కరికీ డిజిటల్ ఆరోగ్య ఖాతా

సంజీవని ద్వారా ప్రతి వ్యక్తికి ప్రత్యేక డిజిటల్ ఆరోగ్య ఖాతా రూపొందిస్తున్నారు. గతంలో వచ్చిన వ్యాధులు, చేసిన పరీక్షలు, ల్యాబ్ నివేదికలు, వాడిన మందులు, ఆస్పత్రుల్లో పొందిన చికిత్స, వైద్యుల సూచనలు, తదుపరి ఫాలోఅప్ వివరాలు అన్నీ ఒకే డిజిటల్ రికార్డులో భద్రపరుస్తున్నారు. దీంతో గ్రామంలోని ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందిన రోగి జిల్లా ఆస్పత్రి లేదా బోధనాస్పత్రికి వెళ్లినా, అతని పూర్తి వైద్య చరిత్ర వైద్యులకు వెంటనే అందుబాటులోకి వస్తుంది. పాత రిపోర్టులు తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండా చికిత్స వేగవంతమవుతుంది.

### 'రోగి వెంట వైద్య వ్యవస్థ నడవాలి'

రోగిని ఒక ఆస్పత్రికి పంపించడమే కాదు, చికిత్స పూర్తయ్యే వరకు అతని ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థే సంజీవని అని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. వ్యాధులను ముందుగానే గుర్తించడం, సకాలంలో చికిత్స అందించడం, ఫాలోఅప్ సేవలను సమర్థంగా అమలు చేయడం ద్వారా రాష్ట్ర ప్రజలకు మరింత మెరుగైన ఆరోగ్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

# ప్రపంచ వేదికపై ఏపీ మెడికల్ కాలేజీల సత్తా

- 'ది లాన్సెట్'లో పోలియో టీకా పరిశోధన
- ఆంధ్ర, కర్నూలు ప్రభుత్వ వైద్య కళాశాలలకు అంతర్జాతీయ గుర్తింపు
- పరిశోధక వైద్యులు డా. చక్రవర్తి, డా. విజయానంద్‌కు మంత్రి సత్యకుమార్ అభినందనలు



అమరావతి(ప్రశ్న న్యూస్) ప్రపంచ ప్రఖ్యాత వైద్య పరిశోధన రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్య కళాశాలలు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నాయి. చిన్నారులకు అందించే పోలియో టీకాపై నిర్వహించిన కీలక అంతర్జాతీయ క్లినికల్ పరిశోధన ప్రపంచ ప్రఖ్యాత వైద్య జర్నల్ లిలి'ది లాన్సెట్ ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్'లో ప్రచురితమవడంతో రాష్ట్ర వైద్య విద్య, పరిశోధన రంగానికి విశిష్ట గుర్తింపు లభించింది. దేశంలోని తొమ్మిది ప్రముఖ వైద్య విద్యాసంస్థలతో కలిసి నిర్వహించిన ఈ అధ్యయనంలో విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్ కాలేజ్--కింగ్ జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్), కర్నూలు మెడికల్ కాలేజ్ కీలక భాగస్వాములుగా నిలవడం రాష్ట్రానికి గర్వకారణంగా మారింది.

**643 మంది శిశువులపై రెండేళ్ల పరిశోధన** పోలియో టీకాపై ఈ అధ్యయనాన్ని దాదాపు రెండేళ్లపాటు ఫేజ్-2/3 డబుల్-బ్లైండ్ ర్యాండమైజ్డ్ కంట్రోల్డ్ క్లినికల్ ట్రయల్ రూపంలో నిర్వహించారు. తొలి దశలో 100 మంది శిశువులపై, అనంతరం మొత్తం 643 మంది చిన్నారులపై పరిశోధన చేపట్టారు. విశాఖలోని ఆంధ్ర మెడికల్ కాలేజ్--కేజీహెచ్‌లో డాక్టర్ బి.ఎస్. చక్రవర్తి ఆధ్వర్యంలో వంద మందికిపైగా చిన్నారులు ఈ అధ్యయనంలో పాల్గొన్నారు. కర్నూలు మెడికల్ కాలేజ్ కూడా ఈ పరిశోధనలో కీలక పాత్ర పోషించింది.

**దేశంలోని తొమ్మిది సంస్థల్లో రెండు ఏపీ ప్రభుత్వ కళాశాలలే** ఈ బహుళ కేంద్రాల పరిశోధనకు పుణెలోని సీరం ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సమన్వయ సంస్థగా వ్యవహరించింది. ఐసీఎంఆర్, పీజీఐఎంఈఆర్ చండీగఢ్, నాయర్ ఆసుపత్రి ముంబయి, భారతి విద్యాపీఠ్, మైసూరు మెడికల్ కాలేజ్, భువనేశ్వర్‌లోని ఐఎంఎస్--సమ్ ఆసుపత్రి వంటి దేశంలోని అగ్రశ్రేణి వైద్య సంస్థలతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆంధ్ర మెడికల్ కాలేజ్, కర్నూలు మెడికల్ కాలేజ్‌లను అధ్యయన కేంద్రాలుగా ఎంపిక చేయడం రాష్ట్ర వైద్య రంగానికి విశిష్ట గుర్తింపుగా నిలిచింది. ఈ ఘనత సాధించిన పరిశోధక వైద్యులు డాక్టర్ బి.ఎస్. చక్రవర్తి, డాక్టర్ విజయానంద్తో పాటు వారి బృందానికి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ, ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలోని మిగిలిన ప్రభుత్వ వైద్య కళాశాలలు కూడా ప్రపంచస్థాయి పరిశోధనల్లో ముందంజలో నిలవాలని ఆకాంక్షించారు.

# హిమాయత్ నగర్‌లో కాంగ్రెస్ నిరసన ర్యాలీ

**హైదరాబాద్** ఢిల్లీలో రాహుల్ గాంధీ పై దాడిని, విద్యార్థులపై లాఠీ చార్జీని, అరెస్టులను ఖండిస్తూ... కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హిమాయత్ నగర్ కూడలి నుంచి హైదర్ గూడ ఎమ్మెల్యే క్వార్టర్స్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. హిమాయత్ నగర్ వై జంక్షన్ నుండి హైదర్ గూడ చౌరస్తా వరకు శాంతియుత ర్యాలీ చేపట్టారు. నీట్ పేపర్ లికేజ్ కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేందర్ ప్రధన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు. 22 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటం అడుతుందని ఆరోపించారు. ప్రశ్న పత్రాలను కాపాడలేని నాయకులు , దేశాన్ని ఎలా కాపాడుతారని ప్రశ్నించారు. ఇప్పటికైనా విద్యార్థుల డిమాండ్ ను పరిగణలోకి తీసుకుని ధర్మేందర్ ప్రధన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా ధర్మేందర్ ప్రధన్ దిష్టిబొమ్మను దహనం చేసారు. పోలీసులు నిరసనకారులను అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో పోలీసులకు, కాంగ్రెస్ నాయకుల మధ్య తోపులాట జరిగింది.

# కెటిఆర్ పుట్టినరోజు వేడుకలు

**- ఘనంగా నిర్వహించిన బి ఆర్ ఎస్ వి జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్.**



బి ఆర్ ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు మాజీ మంత్రి కె టి ఆర్రి పుట్టినరోజు సందర్భంగా బి ఆర్ ఎస్ వి జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ ఆధ్వర్యంలో ఉట్నూర్ మండలంలోని వికాసం పాఠశాలలో మాజీ ఎంపీపీ బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పంద్ర జైవంత్ రావు బి ఆర్ ఎస్ బి ఆర్ ఎస్ వి నాయకులతో కలిసి విద్యార్థిని విద్యార్థులకు బి ఆర్ ఎస్ వి జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధరణి రాజేష్ మాట్లాడుతూ.. ప్రజా సేవకు నిర్వచనం, నిస్వార్థ రాజకీయాలకు నిలువెత్తు రూపం,ప్రజల నాయకులు కేటీఆర్ గారని తెలిపారు.వారు ఆయు ఆరోగ్యాలతో అష్ట ఐశ్వర్యలతో సుఖ సంతోషాలతో బాగుండాలని ప్రజా సేవలో మరింత ముందు ఉండి ప్రజలకు మరెన్నో సేవలు అందించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఆజ్మీరా జయ చంద్ర దూట మహేందర్ సిడం సోనే రావు కమేరి రాజు సాజిద్ రాథోడ్ అన్వేష్ జాదవ్ గిరి నాయక్ గౌవాస్కర్ మహేష్ పొన్నం సాయి సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రారంభానికే పరిమితమైన చెత్త నుంచి సంపద కేంద్రం

**సి.బెళగల్, జూలై 24** సి.బెళగల్ మండలంలోని కొత్తకోట గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) నిధులతో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రం ప్రారంభమైన కొద్ది రోజులకే మూతపడిన పరిస్థితి నెలకొంది. గ్రామంలో రోజూ ఉత్పత్తి అయ్యే ఘన వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించి, వాటిని తడి?పొడి చెత్తగా వేరు చేసి సేంద్రియ ఎరువు తయారు చేయడం, ప్లాస్టిక్ వంటి వ్యర్థాలను రీసైక్లింగ్‌కు పంపించడం ద్వారా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలనే ప్రధాన లక్ష్యంతో ఈ కేంద్రాన్ని నిర్మించారు. అయితే అధికారుల పర్యవేక్షణ, నిర్వహణ లోపం కారణంగా ఈ కేంద్రం ప్రస్తుతం పూర్తిగా నిరుపయోగంగా మారిందని గ్రామస్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు వ్యర్థాలను సంపదగా మార్చే ఉద్దేశంతో ఈ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ కొత్తకోట గ్రామంలో నిర్మించిన కేంద్రం ప్రారంభోత్సవానికే పరిమితమైపోవడంతో ప్రజల ఆశలు నీరుగారిపోయాయి. ప్రారంభ సమయంలో కొద్ది రోజుల పాటు మాత్రమే కార్యకలాపాలు నిర్వహించి, అనంతరం పూర్తిగా నిలిపివేయడంతో భవనం మూతపడిన స్థితిలో కనిపిస్తోందని స్థానికులు చెబుతున్నారు.కేంద్రంలో తడి, పొడి చెత్త వేరు చేసే పనులు నిలిచిపోవడంతో గ్రామంలోని చెత్తను యథేచ్ఛగా ఇతర ప్రాంతాల్లో పడేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. దీంతో గ్రామ పరిశుభ్రత దెబ్బతింటోందని, వర్షాకాలంలో దుర్వాసన, దోమలు, ఈగలు పెరిగి ప్రజారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం ప్రజాధనంతో నిర్మించిన ఈ కేంద్రానికి అవసరమైన నిర్వహణ లేకపోవడం వల్ల భవనం, యంత్రాలు, ఇతర సామగ్రి కూడా కాలక్రమేణా పాడైపోయే పరిస్థితి నెలకొన్నదని గ్రామస్థులు చెబుతున్నారు. లక్షల రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన ఆస్తి వినియోగంలో లేకపోవడం బాధాకరమని వారు పేర్కొంటున్నారు.గ్రామ పంచాయతీ పరిధిలో ఘన వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయాల్సిన అధికారులు కేంద్రం నిర్వహణపై దృష్టి సారించకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కేంద్రాన్ని క్రమం తప్పకుండా నిర్వహించి ఉంటే గ్రామ పరిశుభ్రత మెరుగుపడటంతో పాటు సేంద్రియ ఎరువు




తయారీ ద్వారా గ్రామానికి ఆదాయం కూడా సమకూరేదని వారు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చెత్త నుంచి సంపద కేంద్రాన్ని తిరిగి ప్రారంభించడంతో పాటు అవసరమైన సిబ్బందిని నియమించి, యంత్రాలను మరమ్మతు చేసి, ఘన వ్యర్థాల నిర్వహణను పునఃప్రారంభించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఈ కేంద్రం ఎందుకు మూతపడిందనే అంశంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఈ కేంద్రాన్ని ప్రజలకు ఉపయోగపడే విధంగా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.ప్రజా ధనంతో నిర్మించిన అభివృద్ధి పనులు కేవలం ప్రారంభోత్సవాలకే పరిమితం కాకుండా, దీర్ఘకాలం ప్రజలకు ప్రయోజనం చేకూరేలా నిర్వహించడం అధికారుల బాధ్యత అని గ్రామస్థులు స్పష్టం చేస్తున్నారు

# అదిలాబాద్‌లో విద్యాసంస్థలు, కళాశాలల బంద్




**అదిలాబాద్** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా వ్యతిరేక విధానాలు, ప్రభుత్వ విద్యను బలహీనపరిచే నిర్ణయాలు, విద్యార్థులపై పెరుగుతున్న ఆర్థిక భారం, విద్యా రంగంలో ప్రైవేటీకరణను నిరసిస్తూ విద్యాసంస్థలు, కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా పిడిఎస్యు (ఖఆూజ) అదిలాబాద్ జిల్లా అధ్యక్షులు సాయికుమార్, జిల్లా కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే విధానాలను తీవ్రంగా ఖండించారు. నీట్ పరీక్షలో పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పరీక్షల నిర్వహణలో పారదర్శకతను తీసుకురావాలని, విద్యార్థుల ప్రయోజనాలను కాపాడే చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో ంమోఈ నాయకుడు కేశవ్, ంమోజ నాయకుడు కపిల్, ూఈఎ నాయకుడు ఇసాక్, ఃఖీూఎ నాయకుడు శివకుమార్, ంఎజఈ నాయకుడు భాస్కర్ తదితరులు పాల్గొని బంద్‌కు తమ సంఘీభావాన్ని ప్రకటించారు.విద్యార్థులు, యువత, ఉపాధ్యాయులు, ప్రజాస్వామ్యవాదులు అందరూ ఈ బంద్‌కు మద్దతు తెలిపి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

# జగిత్యాల్లో ప్రభుత్వ కార్యాలయంను దర్జాగా వినియోగిస్తున్న ప్రైవేట్ సంఘం

- వర్షానికి తడుస్తూ బయట కూర్చొని విధులు నిర్వహించిన ప్రభుత్వ సిబ్బంది
- వర్షానికి తడిచి పోతున్న విలువనై పహాని పత్రాలు



**జగిత్యాల(ప్రశ్న న్యూస్)** జగిత్యాల ఆర్డీవో కార్యాలయం ఆవరణలోని ప్రభుత్వ భవనంను సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రైవేటు సంస్థ ఆక్రమణ అంశంపై, ప్రజల నుండి జగిత్యాల ఆర్డీవో కు ఫిర్యాదులు అందడంతో జిల్లా అధికారులు స్పందించారు.ప్రైవేట్ సంస్థ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ జగిత్యాలలోని ఇప్పటి జిల్లా అధికారుల అధికారిక ఉత్తర్వులు లేకుండా ఆర్డీవో కార్యాలయం ఆవరణలోని ప్రభుత్వ భవనాన్ని వినియోగించినందున, ఆర్డీవో కార్యాలయం ఆవరణలోని ప్రభుత్వ భవనాన్ని తిరిగి ప్రభుత్వ స్వాధీనంలోకి తీసుకొని ప్రభుత్వ అవసరాల కోసం అధికారులు వినియోగంలోకి తెచ్చారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# కేటుగాళ్ల 'నకిలీ' స్కెచ్

## రూ. 4.11 కోట్ల బ్యాంక్ రుణాలు స్వాహా

- కేసు ఛేదించిన కీసర పోలీసులు.. క్రయవిక్రయాల్లో జాగ్రత్త వహించాలని హెచ్చరిక




కీసర( ప్రశ్న న్యూస్) కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన రూ.4.11 కోట్ల విలువైన భారీ మోసం కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. క్రైమ్ నం. 928/2025లో మొత్తం 29 మంది నిందితులపై దర్యాప్తు పూర్తి చేసి న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేశారు.ఈ కేసులో నకిలీ పత్రాలు సృష్టించడం, మోసం, నమ్మకద్రోహం, నకిలీ పత్రాల వినియోగం వంటి ఆరోపణలపై భారతీయ శిక్షాస్మృతి (ఖాజ) సెక్షన్లు 420, 406, 467, 468, 471 కింద అభియోగాలు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.ప్రధాన నిందితుడితో పాటు ఇతర నిందితులు వివిధ రకాలుగా కుట్రలో పాల్గొని బాధితులను మోసం చేసినట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు పేర్కొన్నారు. కేసుకు సంబంధించిన అన్ని ఆధారాలు, సాక్ష్యాలను సేకరించి చార్జిషీట్‌ను కోర్టులో సమర్పించినట్లు వెల్లడించారు.కోర్టు తదుపరి విచారణలో నిందితులపై చట్టపరమైన చర్యలు కొనసాగనున్నాయి.

# కరెంటు కోతలతో రైతుల కష్టాలు.. 24 గంటల హామీ ఏమైంది.?

- ఉమ్మడి కీసర, ఘట్‌కేసర్, షామీర్‌పేట్ మండలాల్లో తీవ్ర విద్యుత్ సమస్యలు..
- రైతులను ఆదుకోవాలని బీజేవైఎం జిల్లా కార్యదర్శి నాయిని నరేందర్ రెడ్డి డిమాండ్



**కీసర( ప్రశ్న న్యూస్)** ఉమ్మడి కీసర, ఘట్‌కేసర్, షామీర్‌పేట్ మండలాల్లో రైతులు తీవ్ర విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని మేడ్చల్ రూరల్ బీజేవైఎం జిల్లా కార్యదర్శి నాయిని నరేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నికల ముందు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ప్రస్తుతం కనీసం 12 గంటల పాటు కూడా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడం లేదని ఆయన విమర్శించారు. ఇప్పటికే వర్షాలు సకాలంలో కురవక పంటలు దెబ్బతింటుండగా, మరోవైపు విద్యుత్ కోతలతో బోర్ల ద్వారా సాగు చేసే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఈ ప్రాంతంలోని అధిక శాతం రైతులు బోర్లపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారని, విద్యుత్ సరఫరా లేకపోతే సాగు ఎలా చేయాలని రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారని తెలిపారు. రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా కల్పించి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులను నాయిని నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు.

# సిపిఎస్ జనజాగరణ బస్సు యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

- ఉద్యోగుల ఐక్యతతో ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపు



**గజ్వేల్( ప్రశ్న న్యూస్ )** కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు, సిద్దిపేట జిల్లా టీఎస్సీపీఎస్ఈయు అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్, జిల్లా కార్యదర్శి విక్రమ్ రెడ్డి ఆదేశాల మేరకు, ఆగస్టు 23న నిర్వహించనున్న "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు."సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి", "ఐక్యంగా చరిత్రను తిరగరాద్దాం" అనే నినాదాలతో చేపడుతున్న జనజాగరణ బస్సు యాత్ర ఈ నెల 30న గజ్వేల్ పట్టణానికి చేరుకోనుంది. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ కేంద్రంలోని సమీకృత కార్యాలయంలో జనజాగరణ యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే లక్ష్యంతో చేపట్టిన ఉద్యమానికి ఉద్యోగులంతా ఐక్యంగా మద్దతు తెలపాలని, ఆగస్టు 23న జరిగే "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ద్వారా ఉద్యోగుల ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎస్సీపీఎస్ఈయు తాలూకా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు లింగం, తాలూకా కార్యదర్శి ప్రవీణ్, సహాధ్యక్షులు సలావుద్దీన్, ట్రెజరర్ భరత్, జిల్లా నాయకులు వెంకట్, తాలూకా నాయకులు నర్సింలు, కోటేశ్వర్, సంతోష్, సచిన్, కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర సిపిఎస్ సంఘం నాయకులు మల్లికార్జున్, జిల్లా సిపిఎస్ నాయకులు రాజు, గజ్వేల్ ఏడీఏ బాబునాయక్, ఎఫ్ఆర్ఓ వినాయక్, డిటి శ్రీనివాస్‌తో పాటు సమీకృత కార్యాలయ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేను పార్టీ మారాను..

రక్తలేఖ ఘటనపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి భావోద్వేగ స్పందన

- అతని అడ్రస్ తెలిసి ఉంటే ఇంటికే వెళ్లి కలిసేవాడిని..
- బాధతోనే రక్తంతో లేఖ రాశాడు
- కార్యకర్తకు భరోసా ఇచ్చిన మల్లారెడ్డి



**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి పార్టీ మారుతున్నారంటూ జరుగుతున్న ప్రచారానికి స్వయంగా తెరదించారు. ఇటీవల ఓ కార్యకర్త రక్తంతో లేఖ రాసిన ఘటనపై స్పందించిన ఆయన, ఆ కార్యకర్త మనోవేదన తనను కలచివేసిందని అన్నారు."రక్తంతో లేఖ రాయడం బాధాకరం. ఆ కార్యకర్త అడ్రస్ నాకు తెలియదు. తెలిసి ఉంటే నేనే అతని ఇంటికి వెళ్లి కలిసేవాడిని. అతను పార్టీ మారుతారేమోనన్న ఆందోళనతో, అభిమానంతోనే అలా చేశాడు" అని మల్లారెడ్డి పేర్కొన్నారు.అంతేకాకుండా, "నేను ఎలాంటి పార్టీ మారడం లేదు. పార్టీని వీడే ఆలోచన కూడా లేదు. కార్యకర్తలు, అభిమానులు ఎలాంటి అపోహలకు గురికావద్దు" అంటూ స్పష్టమైన సందేశం ఇచ్చారు.ఇటీవల రక్తంతో రాసిన లేఖ సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ కావడంతో పాటు రాజకీయ వర్గాల్లోనూ చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో మల్లారెడ్డి స్వయంగా స్పందించి పార్టీ మార్పుపై వస్తున్న ప్రచారానికి పూర్తి స్థాయిలో చెక్ పెట్టారు.మల్లారెడ్డి చేసిన వ్యాఖ్యలతో ఆయన అనుచరులు, పార్టీ కార్యకర్తల్లో నెలకొన్న సందిగ్ధత తొలగిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కార్యకర్తల భావోద్వేగాలకు విలువ ఇస్తూ, వారిని నేరుగా కలిసేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పడం రాజకీయంగా కూడా ప్రాధాన్యత సంతరించుకుంది.నేను పార్టీ మారలేదు... మారను. కార్యకర్తల అభిమానాన్ని ఎప్పటికీ గౌరవిస్తాను. ఆ కార్యకర్త అడ్రస్ దొరికితే తప్పకుండా వెళ్లి కలుస్తాను,మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి

# రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి చిన్నారెడ్డికి ఘన సన్మానం

- ప్రజావాణి చొరవతో ల్యాబ్ టెక్నీషియన్స్ గా పోస్టింగ్స్ పొందిన అభ్యర్థులు



ప్రజాభవన్(ప్రశ్న న్యూస్) ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డిని ఇటీవల లాబ్ టెక్నీషియన్లగా పోస్టింగ్ పొందిన ఉద్యోగులు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో నిర్వహించిన 241వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో పెద్ద ఎత్తున ల్యాబ్ టెక్నీషియన్స్ వచ్చారు. ఇటీవల జరిగిన ల్యాబ్ టెక్నీషియన్స్ ఉద్యోగాల భర్తీ కోసం పరీక్షలు రాసి పోస్టింగ్ ఇవ్వడంలో జరిగిన జాప్యంతో సీఎం ప్రజావాణిని ఆశ్రయించిన అభ్యర్థులు ఈ విషయంపై ప్రజావాణి ఇంచార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి చిన్నారెడ్డిని కలిసి తమ ఆవేదన వ్యక్తం చేసారు. వెంటనే ఆయన స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి పోస్టింగ్స్ తొందరగా ఇవ్వాలని సూచించడంతో తమ సమస్య పరిష్కారామై అర్హులైన వారికి పోస్టింగ్స్ వచ్చాయని తెలుపుతు తమ సమస్యను వెంటనే పరిష్కరించేలా కృషి చేసిన చిన్నారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ సమీ, కోటేశ్వర్ రెడ్డి, శంకర్ బాబు, పందరి రెడ్డి, రాజశేఖర్, సత్యం, ప్రవీణ్, మౌజం, విజయ భాస్కర్, మాధవి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గిఫ్ట్ ఏ స్మైల్‌తో వెలిగిన విద్యా దీపం నిరుపేద విద్యార్థినికి అండగా మాదాసు శ్రీనివాస్

- బాసర ఐఐఐటీ చదువు పూర్తయ్యే వరకు పూర్తి సహకారం



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** పేదరికం ప్రతిభకు అడ్డంకి కాకూడదనే గొప్ప సంకల్పంతో గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు మాదాసు శ్రీనివాస్ మరోసారి తన సామాజిక బాధ్యతను చాటుకున్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో భాగంగా, బాసర ఐఐఐటీలో సీటు సాధించిన ఓ నిరుపేద విద్యార్థినికి పూర్తి స్థాయి విద్యా సహాయాన్ని ప్రకటించి అభినందనలు అందుకున్నారు.గజ్వేల్ మండలం బంగ్లా వెంకటాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి శ్రీనివాస్--వరలక్ష్మి దంపతుల కుమార్తె కుమ్మరి శ్రీజ, పదో తరగతిలో 562 మార్కులు సాధించి ప్రతిష్ఠాత్మక బాసర ఐఐఐటీలో ప్రవేశం పొందింది. అయితే కూలీ పనులపై ఆధారపడే కుటుంబం కావడంతో ఆమె ఉన్నత విద్యకు ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ విషయాన్ని గ్రామ ఉపాధ్యాయుడు, సామాజిక సేవకుడు పులిరాజు మాదాసు శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించారు.విద్యార్థిని శ్రీజకు అడ్మిషన్ ఫీజు, పుస్తకాలు, విద్యా సామగ్రి, కొత్త దుస్తులు, ఇతర అవసరమైన వస్తువులతో పాటు ఒక సంవత్సరం విద్యా ఖర్చులకు సరిపడా ఆర్థిక సహాయం అందించారు. అంతేకాకుండా, బాసర ఐఐఐటీలో ఆమె విద్య పూర్తయ్యే వరకు అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మాదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ, "ప్రతిభ ఉన్న ప్రతి పేద విద్యార్థికి చేయూత అందించడం సమాజం బాధ్యత. మంచి విద్యే పేదరికాన్ని జయించే శక్తివంతమైన ఆయుధం. ఆర్థిక ఇబ్బందులు ఏ విద్యార్థి భవిష్యత్తును అడ్డుకోకూడదు" అని అన్నారు.విద్యార్థిని శ్రీజ మాట్లాడుతూ, తన విద్యాభ్యాసానికి అండగా నిలిచిన మాదాసు శ్రీనివాస్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బాగా చదివి సమాజానికి ఉపయోగపడే స్థాయికి ఎదుగుతానని చెప్పారు. అలాగే మాజీ మంత్రి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన ప్రజాసేవ మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బంగ్లా వెంకటాపూర్ సర్పంచ్ నాగలక్ష్మి నర్సింలు, మాజీ సర్పంచ్ బాపురెడ్డి, ఉపాధ్యాయుడు పులిరాజు, టీపీటీఎఫ్ నాయకులు జె. శ్రీనివాస్, తాళ్ల నాగరాజు, విద్యాసాగర్, మహేందర్ రెడ్డి, కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు రమేష్ గౌడ్, అహ్మద్, రవీందర్ గౌడ్, లడ్డు, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు కాంగ్రెస్ కార్యకర్తలా ప్రధాని దిష్టిబొమ్మ దగ్ధంపై బీజేపీ ఫైర్

- దేవదుల నీళ్లు మైదానానికి తరలిస్తే ఏజెన్సీ నాశనం: రామరాజు
- రెవిన్యూ డివిజన్, బస్సు డిపో, కొండాయి బ్రిడ్జి వెంటనే పూర్తి చేయాలి



**ఏటూరునాగారం(ప్రశ్నన్యూస్)** దేశ ప్రధానమంత్రి, కేంద్ర మంత్రుల దిష్టిబొమ్మలను కాంగ్రెస్ నాయకులు తగలబెడుతున్నా సీఐ, ఎస్ఐలు చూస్తూ ఊరుకోవడం బాధాకరమని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు డా. జాడి రామరాజు నేత అన్నారు.శుక్రవారం ఏటూరునాగారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు కాంగ్రెస్ కార్యకర్తల్లా మారి మంత్రి మెప్పుకోసం పనిచేస్తున్నారని ఆరోపించారు. అలాంటప్పుడు ప్రజలకు న్యాయం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు.కాంగ్రెస్ నాయకులకు ఆదివాసీ, దళిత, బహుజన, మైనార్టీ వర్గాల అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే దేవదుల లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి మైదాన ప్రాంతానికి నీళ్లు తరలిస్తూ ఏజెన్సీని ఎడారిగా మారుస్తున్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దిష్టిబొమ్మను తగలబెట్టాలని డిమాండ్ చేశారు.అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చని రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మలు తగలబెట్టాలన్నారు. నాటి ఎమ్మెల్యే, నేటి మంత్రి ఆదేశాలతో డీసీ అధ్యక్షుడు పైడుకుల అశోక్ ధర్నాలు చేస్తున్నారని, అవి మంత్రి మెప్పు కోసమే తప్ప ప్రజా సమస్యల కోసం కాదని విమర్శించారు.ఏటూరునాగారం రెవిన్యూ డివిజన్, బస్సు డిపో, కొండాయి బ్రిడ్జి పనులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు అధికారంలో ఉండి పాఠశాలలు బంద్ చేయించి విద్యార్థులను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు.ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం మండలాల్లోని ఆదివాసీ, దళిత, బహుజన, మైనార్టీ వర్గాల అభివృద్ధిపై మంత్రిని నిలదీయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ధర్నాలు రాజకీయ లబ్ధి కోసమేనని, వాటిని ప్రజలు గుర్తించి తిరస్కరించాలని జాడి రామరాజు నేత, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పిలుపునిచ్చారు.

# ధర్నా చౌక్‌కి కదిలిన పటాన్చెరు యువతరం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నేతృత్వంలో 300కు పైగా వాహనాలతో భారీ ర్యాలీ
- విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటం
- ప్రజాస్వామ్య భారతదేశంలో ప్రశ్నించడమే నేరమా
- విద్యార్థుల పోరాటానికి బిఆర్ఎస్ సంపూర్ణ మద్దతు
- పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్చెరు( ప్రశ్న న్యూస్ )** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతూ.. ప్రశ్నించిన వారిపై దమనకాండ కొనసాగిస్తోందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భవిష్యత్తు కోసం పోరాటం చేస్తున్న విద్యార్థి లోకానికి బిఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు. దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థులు, యువతపై కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం చేస్తున్న దమనకాండకు వ్యతిరేకంగా శుక్రవారం భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని ధర్నా చౌక్ లో చేపట్టిన నిరసన కార్యక్రమానికి పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో వందలాదిమంది విద్యార్థులు, యువకులు ద్విచక్ర వాహనాలు, 300 పైగా కార్లలో ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం విద్యారంగాన్ని భ్రష్టు పట్టిస్తోందని విమర్శించారు. గత 12 సంవత్సరాల ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో 158 పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని పేర్కొన్నారు. నీట్ వంటి కీలకమైన జాతీయ స్థాయి పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ కావడం మూలంగా లక్షలాది మంది విద్యార్థుల జీవితాలు అగమ్యగోచరంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పనితీరులో పారదర్శకత కరువైందని.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రశ్నాపత్రాల లీకేజీ అంశంలో న్యాయం చేయాలంటూ లక్షలాదిమంది విద్యార్థులు ఢిల్లీ జంతర్ మంతర్ వేదికగా శాంతియుత నిరసన ప్రదర్శనలు చేపడుతుంటే.. అత్యంత పాషవికంగా లాఠీచార్జీలు, టియర్ గ్యాస్ ప్రయోగిస్తూ కేంద్ర ప్రభుత్వం నియంత పరిపాలన కొనసాగిస్తుందని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్య భారతదేశంలో ప్రశ్నించడమే నేరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల పోరాటానికి బిఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, యువత, విద్యార్థి విభాగం కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలి: వినుకొల్లు చక్రవర్తి

- బివిద్యార్థుల పేరుతో కాంగ్రెస్ రాజకీయ డ్రామాద
- బీజేపీ మండల అధ్యక్షుడు ఆగ్రహం



**ఏటూరునాగారం(ప్రశ్న న్యూస్)** కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల సమస్యల కోసం కాకుండా కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే నిరసనలు చేస్తోందని బీజేపీ ఏటూరునాగారం మండల అధ్యక్షులు వినుకొల్లు చక్రవర్తి విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా వ్యవహరించడం కాంగ్రెస్ అవకాశవాద రాజకీయాలకు నిదర్శనమని ఆయన అన్నారు.శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఇప్పుడు విద్యార్థుల పేరుతో ధర్నాలు చేయడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. గత ఏడాది మార్చి 21న కాంగ్రెస్ హయాంలోనే పదో తరగతి పరీక్షల తొలిరోజు ప్రశ్నాపత్రాలు లీకైన విషయాన్ని గుర్తుచేశారు. విద్యార్థుల పేరుతో కాంగ్రెస్ చేస్తున్నది అరాచకం. దేశంలో కాంగ్రెస్ పార్టీ కనుమరుగైపోయింది. తెలంగాణలో కూడా ప్రజలు కాంగ్రెస్‌ను బొంద పెట్టడం ఖాయం అని వ్యాఖ్యానించారు.బీ జే పి మండల అధ్యక్షుడు చక్రవర్తి మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో మాట మాట్లాడడం కాంగ్రెస్ పార్టీకి అలవాటు. నీచమైన రాజకీయాలతో కేంద్ర ప్రభుత్వంపై నిందలు మోపేందుకు కుట్రలు చేస్తున్న కాంగ్రెస్‌ను ప్రజలు ఎప్పుడో కాలగర్భంలో కలిపారు.

# వికారాబాద్‌లో రైలు గేటు కష్టాలు

## అభివృద్ధి ఎక్కడ.? ప్రజల ప్రాణాలతో చెలగాటమేనా.?

- నిత్యం గంటల తరబడి రైలు గేటు మూసివేతతో ట్రాఫిక్ నరకం
- జిల్లా ఆసుపత్రికి వెళ్లే రోగులకు ప్రాణసంకట పరిస్థితి
- ఆర్‌ఓబీ లేదా ఆర్‌యూబీ నిర్మాణం కోసం ప్రజల వేడుకోలు
- అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు







**వికారాబాద్(ప్రశ్న న్యూస్)** వికారాబాద్ పట్టణంలోని రైల్వే గేటు సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. అభివృద్ధి మాటల్లోనే ఉందని, ప్రజల ఇబ్బందులు మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకు అనేకసార్లు రైలు గేటు మూసివేయడంతో గంటల తరబడి వాహనాలు నిలిచిపోతున్నాయి. అంబులెన్సులు, అత్యవసర సేవల వాహనాలు కూడా ట్రాఫిక్‌లో చిక్కుకుపోతుండటంతో ప్రజల ప్రాణాలే ప్రమాదంలో పడుతున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది.జిల్లా ఆసుపత్రికి వెళ్లే రోగులు, గర్భిణీలు, వృద్ధులు, ప్రమాద బాధితులు రైల్వే గేటు వద్దే నిలిచిపోవాల్సిన దుస్థితి నెలకొంది. అత్యవసర సమయంలో గేటు పడితే ఎంతసేపు వేచి ఉండాలో తెలియని పరిస్థితి ఉండడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. సమయానికి చికిత్స అందకపోతే ప్రాణనష్టం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.రైలు గేటు కారణంగా పట్టణంలోని ఒకవైపు నుంచి మరోవైపు వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పరిసర గ్రామాలకు వెళ్లే ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు ప్రతిరోజూ ట్రాఫిక్‌లో చిక్కుకుని విలువైన సమయాన్ని కోల్పోతున్నారు. వ్యాపార కార్యకలాపాలు కూడా తీవ్రంగా దెబ్బతింటున్నాయని వ్యాపారులు వాపోతున్నారు.వికారాబాద్ అభివృద్ధి చెందుతోందని ప్రజాప్రతినిధులు చెప్పుకుంటున్నా, ఇలాంటి ప్రాథమిక సమస్యలను పరిష్కరించడంలో మాత్రం పూర్తిగా విఫలమయ్యారని స్థానికులు మండిపడుతున్నారు. ఎన్నో సంవత్సరాలుగా రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) లేదా రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మాణంపై హామీలు వస్తున్నా, ఆచరణలో మాత్రం ఎలాంటి పురోగతి కనిపించడం లేదని విమర్శిస్తున్నారు.స్థానిక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వెంటనే ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసి ఆర్‌ఓబీ లేదా ఆర్‌యూబీ నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇక ఆలస్యం చేస్తే ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో వినతిపత్రాలు ఇచ్చినా, సమస్యను పరిశీలించినా, శాశ్వత పరిష్కారం మాత్రం కనిపించకపోవడం బాధాకరమని అంటున్నారు.వికారాబాద్ అభివృద్ధి పేరుకేనా.? ప్రజల ప్రాణాలకు విలువ లేదా.? అంటూ స్థానికులు నిలదీస్తున్నారు. ట్రాఫిక్ సమస్య, అత్యవసర వైద్య సేవలకు ఏర్పడుతున్న ఆటంకాలు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే రైల్వే ఓవర్ బ్రిడ్జి లేదా అండర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని ప్రజలు ఏకగ్రీవంగా కోరుతున్నారు. లేనిపక్షంలో ఈ సమస్య మరింత తీవ్రమై, ఎప్పుడైనా పెద్ద విషాదానికి దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# గజ్వేల్ పట్టణ సమస్యలపై కేసీఆర్‌కు వినతి

- గజ్వేల్ అభివృద్ధి మళ్లీ పరుగులు తీస్తుంది
- మున్సిపల్ పాలకవర్గానికి కేసీఆర్ భరోసా



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** గజ్వేల్ పట్టణంలో అభివృద్ధి పనులు నిలిచిపోవడం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) దృష్టికి గజ్వేల్ మున్సిపల్ పాలకవర్గం తీసుకెళ్లింది. గజ్వేల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసంలో సమావేశమై గజ్వేల్ అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా గత రెండున్నరేళ్లుగా గజ్వేల్‌లో కీలక అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయని పాలకవర్గం కేసీఆర్‌కు వివరించింది. ముఖ్యంగా కోటమైసమ్మ--క్యాసారం రోడ్డు, రింగ్ రోడ్డుతో పాటు పలు మౌలిక వసతుల పనులు మధ్యలోనే ఆగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.పట్టణంలో రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, మౌలిక వసతులు తదితర సమస్యలపై సుదీర్ఘంగా చర్చించిన కేసీఆర్, గజ్వేల్ అభివృద్ధి బీఆర్‌ఎస్‌కు ఎప్పటికీ ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన అంశమని స్పష్టం చేశారు.“గజ్వేల్ అభివృద్ధి మళ్లీ గాడిలో పడుతుంది... నిలిచిపోయిన అభివృద్ధి పనులు తిరిగి ప్రారంభమయ్యేలా కృషి చేస్తాం. ప్రజల ఆశయాలకు అనుగుణంగా గజ్వేల్‌ను మరింత అభివృద్ధి చేస్తాం” అని మున్సిపల్ పాలకవర్గానికి కేసీఆర్ భరోసా ఇచ్చినట్లు బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ చందన రవీందర్, వైస్ చైర్మన్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# ఢిల్లీలో జరిగిన నీట్ ఆందోళనల్లో కేసీఆర్ ఎందుకు లేరు?

- ఎంపీ స్థానాలను బీఆర్‌ఎస్ బీజేపీకి దానం చేశారని ఆరోపణ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఢిల్లీలో జరిగిన విద్యార్థుల ఆందోళన కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఎందుకు పాల్గొనలేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. బీజేపీతో ఉన్న లోపాయకారీ ఒప్పందం కారణంగానే బీఆర్‌ఎస్ నేతలు ఢిల్లీకి వెళ్లి నిరసన తెలపలేకపోయారని ఆయన విమర్శించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో సున్నా సీట్లు తెచ్చుకుని, వారి ఎంపీ స్థానాలను బీజేపీకి దానం చేశారని ఆరోపించారు. దేశంలో పలు ప్రాంతీయ పార్టీల వలే బీఆర్‌ఎస్ కూడా బీజేపీ గుప్పిట్లోనే ఉందనేది పచ్చి నిజమని, అందుకే గడిచిన పదేళ్లలో బీజేపీ ప్రతిపాదించిన బిల్లులన్నింటికీ బీఆర్‌ఎస్ మద్దతుగా నిలిచిందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఢిల్లీకి వెళ్లకపోయినా, నీట్ ఉద్యమానికి పూర్తిస్థాయిలో మద్దతుగా నిలిచారని అన్నారు. నెల రోజులుగా నీట్ సమస్యపై స్పందించని బీఆర్‌ఎస్ నేతలు, ఇప్పుడు ధర్నా చౌక్ వద్ద కూర్చుని నాటకాలు ఆడుతున్నారని మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ఎన్ని వేషాలు వేసినా ప్రజలు ఇక నమ్మే పరిస్థితి లేదని, విశ్వవిద్యాలయాల ప్రాంగణాల్లోకి వెళ్లే ధైర్యం వారికి ఉందా అని నిలదీశారు. గత పాలనలో ఎంతోమంది విద్యార్థుల బలవన్మరణాలకు, నిరుద్యోగుల ఆత్మహత్యలకు బాధ్యులెవరని ప్రశ్నించారు. కేవలం తమ రాజకీయ ప్రయోజనాల కోసమే నిరుద్యోగులను వాడుకున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో సాగిన పోలీసు రాజ్యం, విచ్చలవిడిగా జరిగిన ఇసుక మాఫియా దోపిడీని తెలంగాణ ప్రజలు ఇంకా మరిచిపోలేదని ఆయన ధ్వజమెత్తారు. నీళ్ల ప్రాజెక్టుల గురించి హరీశ్ రావు మాట్లాడుతున్నారని, కానీ వారి పాలనలో నీళ్ల పేరుతో జరిగిన భారీ దోపిడీ, అక్రమాలను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని స్పష్టం చేశారు.

# 20 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జా.?

- దాదాపు పదేళ్లుగా షెడ్లు నిర్మించి కిరాయిలతో హవా
- బంగారు మైసమ్మ,అభయాంజనేయస్వామి, పోచమ్మ దేవాలయం చైర్మన్ బొబ్బల లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులపై ఆరోపణలు





**బోడుప్పల్(ప్రశ్న న్యూస్)**బిబోడుప్పల్ సర్కిల్ పరిధిలోని సర్వే నెంబర్ 262లో గతంలో ప్రభుత్వం నిరుపేదలకు ఇండ్ల పట్టాలు పంపిణీ చేసింది.ఆ లబ్దిదారులు ఇండ్లు నిర్మించుకోగా..శ్రీ బంగారు మైసమ్మ,వీరాంజనేయ స్వామి,నల్లపోచమ్మ దేవాలయాల కమిటీ చైర్మన్ బొబ్బల లక్ష్మారెడ్డి మాత్రం సర్వే నెంబర్ 31,32,33,34లో గల తన స్థలానికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిపై కన్నేశాడు. మల్లికార్జున దేవాయాలయం ఎదుట రెండువైపులా రోడ్డు వెళ్లడంతో పక్కనే తన భూమికి ఆనుకుని ఉన్న సర్కారు భూమిని ఇదే అదనుగా చెరిపేయడం మొదలు పెట్టాడు. బోడుప్పల్ గ్రామం నుంచి చర్లపల్లికి వెళ్లే రహదారిని పూర్తిగా ఆక్రమించి తన భూమిలో కలుపుకొని ప్రహరీ గోడ నిర్మించాడు.కొన్ని సంవత్సరాల క్రితం నుంచే ఆ భూమిలో వరుసగా నిర్మాణాలు చేపట్టాడు.ప్రస్తుతం తాత్కాలికంగా రేకులతో షెడ్లు,షాపులు ఏర్పాటు చేశాడు.అక్కడితో ఆగకుండా ఓ మినీ ఫంక్షన్ హాల్ నిర్మించి కిరాయిలకు ఇవ్వడం మొదలు పెట్టాడు.వీటన్నింటికీ కుటుంబ సభ్యుల పేర్ల మీద ఇంటి నెంబర్లు పొందడం గమనార్హం. అప్పుడు ఆయన మాజీ వార్డు మెంబర్‌గా ఉండటం, గ్రామ పంచాయతీ కావడంతో సులువుగా ఇంటి నెంబర్లు పొందాడు.

### రాజకీయ నాయకుల అండతో...

ఈ కబ్జాకు కారకుడైన బొబ్బల లక్ష్మారెడ్డి గతం నుంచి రాజకీయ నాయకుడు కావడంతో సర్కారు స్థలాన్ని మింగేస్తున్నా ఎవరూ కిమ్మనలేదు.నిర్మాణాల విషయం అధికారులకు తెలిసినా చూసీచూడనట్టు వ్యవహరించారు.స్థానిక కొంతమంది నాయకుల ప్రోద్భలంతో యథేచ్ఛగా కబ్జాల పర్వం కొనసాగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికీ కొంతమంది అధికారులు కూడా సదరు వ్యాపారి నుంచి ఆమ్యామ్యాలు అందుకుంటున్నట్టు సమాచారం.

అందుకే ఈ అక్రమ షెడ్ల విషయంలో ‘సైలెంట’ మోడ్ నడుస్తోందని టాక్.ఈ నేపథ్యంలో బొబ్బల లక్ష్మారెడ్డితో రాజకీయ వైరం ఉన్న కొందరు నాయకులు హైడ్రా దృష్టికి తీసుకెళ్లడంతో దశాబ్దకాలం దందా వెలుగులోకి వచ్చింది.తాజా ఫిర్యాదు నేపథ్యంలో హైడ్రా,రెవెన్యూ శాఖలు ఎలాంటి చర్యలు చేపడతాయన్నది స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అయితే 262 సర్వే నెంబర్‌లోని కబ్జాలను తొలగించి లైబ్రరీకిగానీ,సర్కిల్ కార్యాలయానికిగానీ,పోలీస్ స్టేషన్‌కుగానీ వినియోగించాలనే డిమాండ్లు కూడా వ్యక్తమవుతున్నాయి.



### ప్రభుత్వ భూములను అక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి : పోగుల వీరారెడ్డి, పులకండ్ల బాల్‌రెడ్డి

సర్వే నంబర్ 262లోని సుమారు రూ.20 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని బొబ్బల లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులు అక్రమంగా కబ్జా చేశారని, పదేళ్లుగా ఆ స్థలంలో షెడ్లు నిర్మించి అద్దెలు వసూలు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోగుల వీరారెడ్డి,పులకండ్ల బాల్‌రెడ్డి ఆరోపించారు.ఈ మేరకు హైడ్రా కమిషనర్‌కు ఇటీవలే ఫిర్యాదు చేసి,శుక్రవారం విలేకరులతో మాట్లాడారు.262 సర్వే నెంబర్ స్థలంలో భారీ షెడ్లు నిర్మించి దాదాపు పదేళ్లుగా అద్దెలు వసూలు చేస్తూ వ్యక్తిగత ఆదాయం పొందుతున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న భూమిని ఆక్రమించి వాణిజ్య అవసరాలకు వినియోగించడం వల్ల ప్రభుత్వానికి భారీ నష్టం వాటిల్లుతోందన్నారు.ఈ సర్వే నెంబర్‌కు సంబంధించిన రెవెన్యూ రికార్డులు,ఇతర అధికారిక పత్రాలను పరిశీలిస్తే ఆక్రమణల వాస్తవాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు.ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరారు. అక్రమంగా నిర్మించిన షెడ్లను తొలగించడంతో పాటు అద్దెలు వసూలు చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్‌ను కోరినట్టు వీరారెడ్డి,బాల్‌రెడ్డి చెప్పారు.

# ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక బ్యూరో ఏర్పాటు

- సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా ఒక బ్యూరోను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రవాణా వ్యవస్థను సమగ్రంగా అధ్యయనం చేసి ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసే బ్యూరోకు సంస్థాగత నిర్మాణం ఉండాలని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రతపై ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియాన్‌లో ఉన్నతాధికారులతో సమీక్షించారు. ప్రతీ 2 లేదా 3 నెలలకోసారి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించాలని ఈ సందర్భంగా అధికారులకు చెప్పారు. ట్రాఫిక్ వ్యవస్థలో నిబంధనలకన్నా క్రమబద్ధీకరణపై ఎక్కువ దృష్టి సారించాలని, వాతావరణంలో వచ్చే మార్పులు, కార్యాలయాల పనివేళలు, రద్దీ సమయాలు, స్థానిక సంస్కృతిని దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

### ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన అధ్యయనం జరగాలి

కొత్తగా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడానికి ముందే ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన అధ్యయనం జరగాలని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదాలు జరగకుండా నియంత్రణ చర్యలు పటిష్టం చేయాలని, ఓఆర్‌ఆర్ పై ఇష్టానుసారంగా వాహనాలు నిలపకుండా నిరంతరం పర్యవేక్షణ జరగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. నగరంలో స్మార్ట్ సిగ్నలింగ్ విధానంపై సమగ్రంగా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి గారు చెప్పారు. సిగ్నల్ ఫ్రీ వ్యవస్థను తీసుకురావడానికి అవసరమైన చోట అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్



కారిడార్‌లను నిర్మించాల్సిన అవసరం ఉందని, సాధ్యమైనంత వరకు సిగ్నళ్ల వద్ద ట్రాఫిక్ నిలిచిపోకుండా వాహనాల రాకపోకలు నిరంతరాయంగా కొనసాగేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు పి. సుదర్శన్ రెడ్, కె. రామకృష్ణారావు, తెలంగాణ సీఎస్ సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588